
# పల్లేరుముళ్ళు



—శాంతి నారాయణ

తోట దగ్గర తెట్టుగోడ పక్కన వేపచెట్టు కింద అరుగుబండ మీద కూర్చొని తోట పక్క తలదిప్పి బీడీ తాగుతున్నాడు నారపరెడ్డి

"అన్నా! రోంత అగ్గిపెట్టిస్తావేమన్నా శానాసేపాయ బీడీ కాల్చక తిక్కబట్టినట్టుంది" అంటూ దారెంట పోతున్న మనిషి దగ్గరికొచ్చి అడిగాడు. నారపరెడ్డి ఈ పక్కకు ముఖం తిప్పి "నువ్వా తిమ్మప్పా! రారా, యన్నాళ్లకు కనిపిస్తివప్పా! అంతా బాగుండారా?" అని ఆదరంగా పలకరించాడు.

"అయ్యో, యెవురో అనుకుంటి గదన్నా!" అంటూ తిమ్మప్ప వచ్చి బండ మీద కూర్చున్నాడు.

నారపరెడ్డి బనియస్ జోబీలో నుంచి అగ్గిపెట్టె తీసి చేతికిచ్చినాడు. తిమ్మప్ప అంగీజోబులో నుంచి తుంట బీడీ బయటికి తీసి అంటించుకున్నాడు.

"యక్కన్నుంచీ వొస్తివప్పా? ఇట్ల యెప్పుడూ రావే" బీడీ ఆరిపేస్తూ అడిగాడు నారపరెడ్డి.

"లోలూర్లో రోంత పనుంటే పొయ్యుంటినన్నా. ఇంగ అట్లే గార్లదిన్నె దెగ్గిరికి పోయి బస్సుకు కాసుకొని అదంతా సుట్టేసుకొని పొయ్యే బదులు యెంతుందిలే అని ఇట్ల అడ్డం తొక్కొని వొస్తినన్నా"

"మంచిపని చేసినావులే. లేకుంటే ఈడుండే దుర్గాను యేమిదూరమప్పా? కొత్త పెండ్లికొడుకు రొంటాలకు పొయ్యొచ్చినంత! ఈ బస్సులొచ్చినంక నడిసే వాళ్లే తక్కువయినారు. మేం పిల్లప్పుడు ఈ దావంతా వొచ్చే పొయ్యే జనంతో యెంత సందడిగా వుండేదని!"

"నిజమేనన్నా. యేందో ఆ కాలమంతా తిక్క కాలం. ఇప్పుడెవురు నడుస్తారు? యెవునికీ పిక్క కండల్లో బలమే లే" అంటూ బండ కింద బీడీ నలిపేశాడు తిమ్మప్ప. నోట్లో వున్న పొగనంతా ముక్కు రంధ్రాల గుండా వొదిలేస్తూ పైకి లేచి చీనా చెట్ల పక్కకెళ్లి తోటంతా తేరిపార జూస్తూ "తోటను బొగుమట్టంగా పెట్టుకుండారన్నా. చెట్లు గూడా శానా పొందిగ్గా వస్తాండాయి" అన్నాడు తిమ్మప్ప.

"ఉండేదే అయిదెకరాల పొలం. దాంట్లో మూడె కరాలే చెట్లు. మట్టంగా పెట్టుకోకుంటే యట్లప్పా?" అంటూ నారపరెడ్డి కూడా చెట్ల దగ్గరికెళ్లాడు.

"చెట్లు నాటి ఎన్నేండ్లయిందన్నా?" పొలాన్ని పరామర్శిస్తూ అడిగాడు మల్లప్ప.

"ఈ వచ్చే మాలపున్నానికి ఎనిమిదేండ్లు అయితుంది తిమ్మప్పా"

"ఎనిమిదేండ్లకే చెట్లు బలే నిక్కినాయన్నా, మాండ్లయినాయి!"

"చెట్లేమో బాగానే వస్తాండాయిగానీ పంటే సరిగా తగులుకోవడం లేదప్పయా. రేటు కూడా ఆటికాటికే"

"ఇసారి ఎడగారు పంటకు రేటు బాగానే వుంటుందిలేన్నా. యాడజూసినా చెట్లన్ని నున్నగ సెంకురోగా లొచ్చి సరికేస్తాండారు. పంట వుంటే గదన్నా రేటు

డవునయ్యేదానికి"!

"యేమోనప్పా. ఆ బగవంతుడు ఏంజేస్తాడో గానీ శానా బేజారయిపొయ్యింది. బావుల్లో నీళ్లన్నా సంరుద్దిగా వుండాయా అంటే అవీలే. ఎండ జూస్తే పొయ్యి మీద పెట్టి యేంచినట్లుంది. తెల్లార్లూ వూరిన నీళ్లు నాలుగు కాలవలు కూడా పారడం గగనమయిపోతాంది. ఇప్పడే యిట్లుంటే గాలి కాలంలో యెట్ల జెయ్యల్లో యేమో. ఇంగ కరెంటు కతంటే మొత్తుకున్నట్లుంది. అదెప్పడొస్తాదో యెప్పడు పోతాదో ఆబ్రెమ్మదేవుడే చెప్పల్ల.... యేందో లేప్పా, అనుకుంటే బాద" లోపలుండే బరువంతా యెల్లగక్కినాడు నారపరెడ్డి.

"అవునన్నా. రైతు బతుకు రాన్రానూ శానా కష్టమయిపోతాంది. యేం జేస్తాం మల్ల తప్పదు. యెట్లోగట్ల యిగ్గులాడల్ల"

"యాడిగ్గులాడతావప్పా. ఇగ్గులాడి యిగ్గులాడి యెముకలన్నీ మెత్తగయినాయి"

"మెత్తగన్నా కానీ గట్టిగన్నా కానీ తప్పదు గదన్నా. రైతు కష్టపడేకే పుట్టినాడంట"

"నిజమేనప్పా. కష్టమంతా రైతుపాలే అయితాంది. ఈ కష్టం తెగేది యెప్పడప్పా?"

"ఇది తెగేది కాదులే గానీ, బాయిలో నీళ్లు నాలుగైదు దినాలకొగసారయినా తడి పారతాయేమన్నా?"

"అయ్యో యాడివి తిమ్మప్ప వారానికొగ తడి పారడమే గగనమయిపోతాందీ"

"అట్లయితే కష్టమేగదన్నా. తీరా చెట్లు వాదు పట్టినంక నీళ్లు తక్కువయితే యేం లాబం? చెట్లు చూస్తే కడుపు సల్లగయితాంది. ఇంతమాత్తరం చెట్లు ఈ మద్దెల యాడా కాన్రాలేదన్న. ఎట్లోగట్ల బాయిలో నీళ్లు కలగజేసుకుంటే మేలు. మా చెట్లూ యిట్లనే వుండె. నిరుడు ముంగార్లప్పడు తీరా వాడొచ్చినంక బాయిలో నీళ్లు లేక అన్నీ యెండిపాయనన్నా అన్నాయమయిపాయ"

"అయితే చెట్లన్నీ కొట్టేస్తిరేమప్పా?"

"కొట్టేయక యేం జేస్తామన్నా! అందికే చెప్పేది. నువ్వు యెట్లన్నాగానీ బిరిగ్గబాయిలో బోరింగు ఏపిచ్చి నీళ్లు కలగజేసుకో. ఇంగా రొండు మూడు తళ్లు (తడులు) నీళ్లు పారబెట్టి వొదిలేస్తే అంతలేకే ఈ ఇగుర్లన్నీ బలుస్తాయి. ఆరెద్దలకార్తికల్లా చెట్లు పూర్తిగా వాదుబడతాయి. అప్పడు నీళ్లు సరిగ్గా కట్టుకుంటే బ్రమ్మాండంగాపూతలొచ్చి అనుకున్నట్లు పంటొస్తాది" నమ్మకం కలిగే విధంగా చెప్పాడు తిమ్మప్ప.

"యాదో వొగటి చేసుకోవల్లప్పా" అంటూ నారపరెడ్డి బరువుగా వూపిరిడిసినాడు

"ఇంగ ఆలస్సెం చెయ్యద్దు నారపరెడ్డన్నా. ఎన్ని ఇబ్బందులున్నా బూమమ్మను నమ్ముకొని బతికేవాళ్లం. ఎప్పడో వొగసారి ఆ తల్లి గడ్డకేస్తాదిలే. బోరింగు యేయిచ్చే ముందు మావూరికి రాన్నా. గొల్లగంగన్న అని వొకాయన వుండాడు. ఆయప పేరు నువ్వు కూడా యినే వుంటావు. బూమిలో నీళ్లు ఎక్కడుండేదీ బొలే బాగ చెప్తాదులే. ఎక్కడెక్కడ నుంచో వచ్చి పిల్చక పోతాంటారు.... నువ్వు రాన్నా మాట్లాడుదాం. మల్లా నువు పొరపాటుతో అనంతపురానికి పోయి జియాలజిట్టూ గియాలిట్టూ అనుకుండేవు. అంతా టక్కర్నాకొడుకులు....యేంటేంటివో మిసన్లు తెచ్చి తకనాబకనా చేసి మడసంగ దుడ్లు గుంజుకొని పోతారు...సరే, నేను పొయ్యొస్తానన్నా. అప్పడే పొద్దు మునిగొచ్చింది" అంటూ తిమ్మప్ప మర్తాటికి బయలుదేరాడు.

నారపరెడ్డి గోసి ఎగజెక్కి భుజమ్మీదుండే టువ్వాల రుమాలుగా తలకు చుట్టుకున్నాడు. మిషన్ రూము పక్కన వారపాక కింద కట్టేసిన గిత్తల తలుగులు తప్పించి పగ్గాలతో పట్టుకొని నీళ్ల పైపు కిందున్న తొట్టిలో నీళ్లు తాపి పక్కనున్న మామిడి చెట్టుకు కట్టేశాడు. వారపాక కిందున్న పేడకాల్లనూ గాట్లో వున్న నలీనట్రనూ తట్టపుటకలో వేసుకొని దిబ్బలో పడేశాడు. పిడికట్టితో కసువంతా వూడ్చి చేతులు కడుక్కున్నాడు. నాలుగు వరిగడ్డపాసలు చుట్టజుట్టి నీళ్ల తొట్టి దగ్గర గిత్తల వొళ్లు కడిగి పగ్గాలు కొమ్ములకు చుట్టి పచ్చిగడ్డి మోపెత్తుకొని గిత్తల వెనుక వూళ్లోకి బయలుదేరాడు నారపరెడ్డి.

తోటల్లో నుంచీ బళ్లూ, పశువులూ గడ్డిమోపులూ కట్టెల గంపలూ అన్నీ వూర్లోకి చేరుకుంటున్నాయి. ఆకులేటి వంకలో నుంచి ఎర్రనేలల్లో దుమ్ములేపుకుంటూ పోతూ వుంది, ఊరావుల మంద. చుట్టగాలికి పైకిలేసిన ఎర్రదుమ్ముతో పాత ఈతాకు మట్టలూ, పారేసిన గుడ్డ పేలికలూ, కల్లా కంపా, చెత్తాచెదారం ఆకాశానికెగిరి గిరగిర తిరుగుతూ కింద పడుతున్నాయి. ఇదంతా నారపరెడ్డి కళ్లకు కనిపిస్తున్నది. మనసులో మాత్రం అయిదెకరాల తోటా, చీనా చెట్లూ, బావిలో నీళ్లూ కనిపిస్తున్నాయి. తిమ్మప్ప చెప్పిన మాటలు వినిపిస్తున్నాయి. మర్తాటి గొల్ల గంగన్నా, బోరింగూ బావి నిండా నీళ్లూ. చీనా చెట్ల నిండా తెల్లగా పూతలూ, పిందెలూ, విరగ్గాసిన చీనాకాయలూ, ఇంటినిండా నవ్వులూ కనిపిస్తుంటే ఆకాశంలో విహరిస్తూ ఇల్లు చేరుకున్నాడు నారపరెడ్డి.

వెన్నెల పాలారబోసినట్లుంది. కొత్తపల్లి వూరంతా మిద్దెల మీదికెక్కి, పిచ్చాపాటి మాట్లాడుతూ భోజనాలు చేస్తున్నారు.

ఎండకాలం వెన్నెలంటే పల్లెటూరి వాళ్లకు చాలా ముచ్చట. తల్లీ పిల్లా అందరూ మిద్దెలమీదికెక్కి చుట్టూ కూర్చొని పళ్లాల కోసం, లోటాల కోసం, చెంబులకోసం పిల్లలు కొట్లాడుతూ గిచ్చుకుంటూ గిల్లుకుంటూ వుంటే వాళ్లను పక్కనే కూర్చోబెట్టుకొని అన్నం తినడమంటే పెద్దవాళ్లకు చాలా సంబరం.


నారపరెడ్డి చిన్న కొడుకునూ చిన్న బిడ్డనూ చెరో పక్క కూర్చోబెట్టుకున్నాడు. వాళ్లిద్దరూ కంచు గుండు చెంబు కోసం కొట్లాడుతూ వుంటే వాళ్లకు సర్ది చెప్పతున్నాడు. ఎడం పక్కన పెద్దకొడుకు సుబ్బిరెడ్డి కూచున్నాడు. రెండో కొడుకు కొండారెడ్డి జతగాళ్ల ఇళ్లకెళ్లి కాస్త ఆలస్యంగా వచ్చి దూరంగా కూచున్నాడు. చెన్నమ్మ కంచాలలో అన్నం వొడ్డిస్తూ వుంది. కూతురు లక్ష్మిదేవి అన్నం వడ్డించిన పళ్లాలను అందరికీ అందిస్తూ వుంది.

కొండారెడ్డి 'వూరుమిండి'లో వేలుబెట్టి గెలికి యేందమ్మా. చెట్నీ చేసినావు. పప్పో, సాంబారో చెయ్యగూడదూ" అని గొనిగాడు.

"ఈ మద్దెలో నీ కోరికలు శానా ఎక్కువయినాయిలే. అందరూ గసిక్కుమనకుండా తింటాంటే నీకొక్కనికే పొసగలేదేమప్పా? బడాయి పడతావా యెట్లెట్ల? నోటికి కమ్మగా వుందని ఇసకసెంచిలాకూ, చింతాకూ మాడిసి దనేలూ, కరేపాకూ యేంచి వూరుమిండి నూరినా. ఇంగ చింతకాయ తొక్కూ, మజ్జిగా వుండనే వుండాయి. ఇవన్నీ పాలవేమప్పా?" అంటూ చెన్నమ్మ కొడుకును మందలించింది.

"ఆయప్ప అనంతపురంలో కాలేజీఈ సదువుతాండాడు గదా. అందుకని రుసులు కోరతాండాడు రుచులు" సుబ్బిరెడ్డి యెగతాలి చేశాడు తమ్ముణ్ని కొండారెడ్డి సుబ్బిరెడ్డి పక్క చుర చుర చూశాడు. బావురుగాడు చూసేవిధంగా.

"వొగనాటి కూడా వొగనాటి కూరాకా రుసిగా మడసంగ చేసుకోని తినడానికప్పా! సర్దుకొని పోవల్ల నాయినా. సదువుకుండేవానివి. నువ్వే ఇట్లయితే యెట్ల? కాలమెంత కస్టంగా వుందో నీకు మాత్తరం తెలీదా? యాది కొనల్లన్నా అగ్గి కురుస్తాంది. ఇరవై రూపాయలు బెట్టి కేజీ కందిబేళ్లు కొనల్లంటే పాసం పిసుకున్నెట్ల అయితాది. శెనిక్కాయి నూనె నలబై రూపాయలంట. ఇంగేందప్పా కొని తినేది? ఈ పాదు నా కొడుకు చెట్ల కత లేకుంటే ఆయిగా శెనిక్కాయి యేసుకొని నాలుగు అక్కెళ్లు అవిన్ని ఇవిన్ని 'పూనా సిగింజలు' చల్లుకుంటే సమ్మత్సరమంతా తినడానికి వొస్తాండె. యేందో అంతా గబ్బు గబ్బయిపాయ"



అంటూ నారపరెడ్డి చేయి కదుక్కుని పక్కకు జరిగాడు. అందరూ ముఖాలొంచుకొని తిన్నారు.

లక్ష్మిదేవి మునుర్లన్నీ కడిగి యెక్కడివక్కడ సర్ది పెట్టి మిద్దెక్కింది. చెన్నమ్మ పిల్లలకు గోనిపట్టలు పరిచి వాటి మీద బొంతలేసింది. నారపరెడ్డికి నులకమంచం తొంచి అగడాల్ల దగ్గర పాత దుప్పటేసి జంకానం పరిచింది. తలపాటుకు రాగి సరుగు దిండు పెట్టింది.

సుబ్బిరెడ్డి ఇంట్లో గాటిపాటున 'అట్టవ' మీదుండే 'జల్ల' లోని పొట్టువుల్లలు గిత్తల ముందు గాట్లో పోసి ఎనుముకు పచ్చిగడ్డి పెట్టి తలుపులన్నీ వేసి మిద్దె పైకి చేరుకున్నాడు. పిల్లలంతా నిద్రబోతున్నారు. కొండారెడ్డి పక్క మిద్దె మీద జతగానితో కలిసి చదువుకుంటున్నాడు. అక్కడక్కడ మిద్దెలపైన కొంతమంది 'సవా' లాడుతున్నారు. దూరంగా మాదిగేరి దగ్గర జడకోలన్న ఆట ఆడుతూ వున్నట్లుంది. సుబ్బిరెడ్డి మంచం పక్కన 'మెరుము' మీద కూచున్నాడు. చెన్నమ్మ అగడాల్ల మీద అడ్డంగా పండుకుంది. నారపరెడ్డి దిండు మీద మోచేతిని ఆనించి కాస్తా వారగవాలి టువ్వాలుతో గాలి విసురుకుంటున్నాడు. ముగ్గురూ చీనా చెట్ల విషయం మాట్లాడుతున్నారు.

"ఎట్లన్నగానీ బోరింగు యేసుకొని నీళ్లు కలగజేసుకుంటే మేలు నాయనా. ఈ 'బండాటి' నీళ్లతో చెట్లుపారబెట్టల్లంటే శానా కష్టంగా వుంది" సుబ్బిరెడ్డి గట్టిగా చెప్పాడు.

"ఇప్పుడు బోరింగు యేసుకోవల్లంటే మాటలేమప్పా. అయిదు వేలన్నా కావల్ల. యాడ తెచ్చేది? యాడన్నా కుదవబెట్టి తెచ్చేకి ఇంట్లో బంగారన్నా వుందా అంటే అదీ లేకపాయె అంతోయింతో మీ అమ్మ పయిమీదుండేది పెండ్లిలో పెద్దపాపకు ఈడానికే తక్కవబడె. రొండేండ్లు ఎల్లిపాయ. ఆయమ్మకు ఇంగా ఈయల్సిన రొండు తులాల బంగారూ ఈకనే పోతిమి. మొన్న వొచ్చినప్పుడే 'యెట్లన్నా గానీ అప్పోసప్పో తెచ్చి ఇచ్చి పోండి నాయినా. వాళ్ల సూటిపోటి మాటల్తో పానం కుల్లిపోతాంది' అని ఆయమ్మ కండ్ల నిండా నీళ్లు నింపిపాయ. ఆయమ్మది యెట్ల జెయ్యల్లో యేమో" నారపరెడ్డి మథనపడ్డాడు.

"దాని బతుకు ఏమయిపోతుందో యేమో! బంగారు మొగమే చూసిరి గానీ బంధువులూ గిందువులూ అనేది రోంతన్నా లేకపాయ. మూడు కాసుల నాకొడుకులు. యాట్నుంచీ వొచ్చిందీ అప్పడే మరిసిపోయిరేమో. వాల్లకూ బిడ్డుంది గదా, రేప్పొద్దన దానికీ పెండ్లి చేసినప్పుడు తెలుస్తాది" అంటూ చెన్నమ్మ సంగటపడింది.

"అంతో యింతో సదువుకుండాడు. బావన్నా అర్థం చేసుకోగూడదా!" సుబ్బిరెడ్డి విచారపడ్డాడు.

"దుడ్ల దెగ్గిర బావాలేదు మామా లేదు. అందురూ వొగిటే నప్పా. యెట్లావాన్ని గానీ దుడ్లు అనేటివి మారుస్తాయి. ఇస్తామని వొప్పకుని ఇవ్వకుంటే ఇట్టా మాటలు తప్పవప్పా" లోకం తీరు చెప్పాడు నారపరెడ్డి.

"యాడన్నా తీసుకొని వొచ్చి వాల్లమొగాన కొట్టేది



మేలు నాయనా"!

"యాడ తీసక రావల్లప్పా? ఈటికే తలకు మించిన బారమయింది. ఎరువుల అంగిట్లో యెనకటి సమ్మత్సరం లెక్క కిందనే ఆరునూర్లు ఇయ్యల్ల. ఇంగ ఈసారి పంట పెట్టుకుండేసరికి యెంత బాకీ అయితుందోయేమో. మొన్న క్రాపులోను అయిదు వేలు తెచ్చుకుంటె అదంతా రంగయ్యకు ఇయ్యాల్సిన వొడ్డి కాసులకూ కరిగిత్తను మార్చుకోడానికీ, కాలిపోయిన మోటరు రిపేరీ చేయిచ్చుకుండేకీ సరిపాయ. అనంతపురంలో నాగయ్య గుడ్డల మలిగిలో నిన్న ఉగాది పండక్కి వెయ్యి రూపాయలు కర్చొచ్చె. యెట్లన్నాగానీ అది వొడ్డీతో పాటు సంకురాత్తిరికి సుస్తా చెయ్యల్ల. ఇన్ని బొక్కలు పెట్టుకుని ఇంగా యాడప్పా రుణం చేసేది?" అంటూ నారపరెడ్డి బరువుగా నిట్టూర్చాడు.

సుబ్బిరెడ్డి మోకాళ్ల సందులో తల ఇరికించుకొని దిగులు చెందాడు.

"ఈ గండాలన్నీ యెట్ల గట్టెక్కల్లో యేమో! బగవంతుడెందుకో సన్నసూపు సూస్తాండాడు. ఆ 'గూగూడు' పోయి కుళ్లాయిసామికి రోంత మొక్కొని రాగూడదా? సంసారానికి యేందో శెని పట్టుకున్నట్లుంది. ఇట్లాటప్పుడయితే ఆ పెద్ద దానికి పెండ్లేం చేసిందుము? పెండ్లయితే చేత్తిమిగానీ ఆ ఇయ్యల్సింది వాల్లమొగాన కొట్టకపోతిమి....ఆ గూబ మొగానివి దాన్ని యెంతరాసి రంపాన పెడతారో యేమో. దాని దిగులు ఇట్లుంటే అప్పడే ఈ రొండేది యెదిగి కుచ్చుండె" చెన్నమ్మ గొంతులో దిగులు పొరాడింది.

కాసేపు ముగ్గురి మధ్యలో మాటలు లేవు. దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. సద్దుమనిగింది. గాలి బొత్తిగా లేదు. ఉక్కపోస్తూ వుంది.

"మల్ల యేంజేస్తామంటావప్పా? బోరింగు యేసుకుందామంటావా?" నారపరెడ్డి కొడుకు పక్క చూశాడు.

"ఎట్లన్నాగానీ యేసుకుందాము నాయినా. బాకీ బాకీ అని బయపడితే అయితుందా? పంట సరిగ్గా తగులుకోవల్లేగాని బాకీ యేంజేస్తాది?" సుబ్బిరెడ్డి మాటల్లో నాలుగు తరాలకు కావలసినంత ధైర్యం విరుచుకుంది.

"బాకీలు తీర్చడానికే కాలమంతా సరిపోతాంది. ఎప్పుడు గట్టెక్కుతామో యేమో! నాలుగు వర్సాలొచ్చి వంకలు దొర్లితే బాయిల్లో నీళ్లు ఉబుకుతాండె. ఈ అవస్త తప్పతాండె. యేందో అంతా వురిపెట్టుకున్నెట్లు అయిపాయ.....ఊ పండుకోప్పా, యింగ పండుకో. తెల్లారినంక యెట్లయితే అట్లయితుందిలే" అని నారపరెడ్డి మంచంకిందున్న చెంబులోని నీళ్లు తాగి చెన్నమ్మను లేపి పండుకున్నాడు. ఆయమ్మ పిల్లోళ్ల పక్కన ముడుక్కుంది.

* * * *

"ఇప్పుడెక్కడుండాయన్నా దుడ్లు? యెక్కడి బాకీ లక్కడ నిల్చిపోయినాయి. ఇచ్చేవాళ్లు సరిగ్గా ఇస్తా వుంటే యేదోవిధంగా తిరుగు మరుగులు చేయొచ్చు. డబ్బులు పుట్టడమే కష్టమయిపోయిందు నారపరెడ్డన్నా. ఈ వ్యాపారాలు చూస్తే గడిపురుసత్తు లేదు, దమ్మిడీ ఆదికం లేదు అన్నట్లుంది. టవున్లో చూస్తే రూపాయి రేటు తగ్గినప్పటి నుండీ సరుకుల రేట్లు ఆకాశానికి ఎగురుతాండాయి. ఇక్కడ చూస్తే నేమో ప్రతిదీ అగ్గవ కావల్లంటారు. పైగా అప్పల వ్యాపారం. ఇంక మిగిలేది యెప్పుడు. మీ యట్లా వాళ్లకు అప్పలిచ్చేదెప్పుడు?" పుస్తకం చదివినట్టు చదివాడు రంగయ్యశెట్టి.

నారపరెడ్డి రంగయ్యశెట్టి యింట్లో హాల్లో వాకిలి పక్కన స్తంభానికి ఆనుకొని కూచున్నాడు. కుడిపక్క చిల్లరంగిట్లో చెక్కపెట్టె మీద కూర్చొని అంగడికి వచ్చిన ఆడపిల్లలతో జాంతనమాడుతూ ఇంకొక్కపక్క తీరిక లేకుండా వ్యాపారం చేస్తున్నాడు రంగయ్య. ఎడం పక్కన 'నెట్లు నెట్లు' వేరుశెనక్కాయ మూటలూ, గింజల మూటలూ 'దంతె' లకు ఆనుకున్నాయి. అవన్నీ చూస్తూ "ఇంతకన్నా మిగులు బాటేమప్పా?" అని అడగాలనుకున్నాడు నారపరెడ్డి. అడిగితే వ్యవహారం చెడిపోవచ్చు. వచ్చిన పని బండపడితే మరీ కష్టం. రంగయ్య దగ్గర రవ్వంత పొరపాటుగా మాట్లాడినా యెవారం బెడిసికొడుతుంది. నిదానంగా మాట్లాడి యేదో ఒకవిధంగా పనిచేసుకుని పోవల్ల. ఇంక ఆ వూర్లో అంత మాత్రమయినోడు యెవడూ లేడు. రామయ్యసెట్టి వున్నా అతగాడు అయిదురు పాయల వడ్డీయేసి కొంపలు ముంచుతాడు.

"మాకున్నట్లే మీకూ యెన్నో ఇబ్బందులు వుంటాయిలేప్పా. యేమి, వ్యాపారమంటే మాట్లా?" రంగయ్య మాటలకు వొత్తాసు పలికాడు నారపరెడ్డి.

"నిజమన్నా. రానాను వ్యాపారం చెయ్యడమే కష్టమయిపోతా వుంది. యేదో మీ లాంటోళ్లకు కొంతమందికి అర్థమవుతుంది గానీ చిల్లర జనానికి యేం తెలుస్తుంది? మేమేదో ఆ టవున్లో నుంచీ సరుకులన్నీ ఫ్రీగా ఎత్తుకొని వచ్చినామనుకొని యాటికంటే ఆటికి అడుగుతారు" రంగయ్య తన వ్యాపారంలో యేదీ మోసం లేనట్లు మాట్లాడి లోపలికెళ్లి కాఫీ తెచ్చిచ్చాడు. నారపరెడ్డి కాఫీ చప్పరిస్తూ "మల్ల యెట్లన్నా గానీ వొగ అయిదువేలు సర్దు రంగయ్యా.

ఇసారి పంటొస్తానే నీ బాకీ వుంచుకోన్లే" అని మెత్తగా అడిగాడు.

"నువ్వుంచుకోవు సరే. ఇప్పుడు నీకియ్యడానికి నా దగ్గరుండల్ల గదన్నా"

"అయిదువేలు సర్దేది నీకేం పెద్ద అగాదం కాదులే రంగయ్యా. యెట్లన్నా గానీ సూడు"

"యాడ చూస్తునప్పా..." సాగదీసి గొనుగుతూ రంగయ్య మళ్లీ ఇంట్లోకెళ్లి పది నిముషాలయినంక బయటికొచ్చి పెట్టె మీద కూచున్నాడు. నారపరెడ్డి రంగయ్య మొగం పక్కే చూస్తున్నాడు.

"ఇప్పడే పదివేలియ్యల్ల. మరీ అయిదువేలంటే బరువు కాదేమన్నా?"

"ఏమి రంగయ్యా అట్లంటావ్. యెన్నిసార్లు తీసుకొని పోలేదప్పా? యానాడన్నా నీకు ఇబ్బంది కలిగిస్తినా. నాకత నీకు తెలీదేమప్పా. నీ సొమ్ము యెక్కడా పోదులే. వువ్వుల్లో పెట్టి తెచ్చిస్తాను"

"నువ్వు తెచ్చిస్తావు సరే. నీ మీద నమ్మకం లేక కాద్దు. నేనూ భద్రం చేసుకోవల్ల గదన్నా. పిల్లలుందేవాళ్లి మొన్న బిడ్డ పెండ్లికి దాదాపు వొకటిన్నర లక్ష ఖర్చాయ. ఇండ్లంతా వూడ్చినట్లయిపాయ. ఇప్పుడు నీకు ఇయ్యల్లంటే యాడయినా అడిగి తెచ్చి ఇయ్యల్సిందే. అందుకే నువ్వు యేమీ అనుకోనంటే వొకమాట...." నసిగాడు రంగయ్య.

"చెప్ప రంగయ్యా.'ముజి గుంబరమెందుకు? ఇచ్చేవానివి నువ్వు. తీసుకుండేవాణ్ని నేను. యెవారం కటీపిటీ తెగిపోవల్ల. శెనిగలు తిని చెయి కదుకు స్నేట్లు వుండల్ల"

"నాకు కావలసిందీ అదేనన్నా.....యేమీ లేదు. పాత బాకీ యెటూ పదివేలుంది. ఇప్పుడు ఇచ్చేదాంతో మొత్తం పదైదు వేలయితుంది. ముందు రాసిచ్చిన ప్రాంసరి నోటు వాపసు తీసుకొని ఇప్పుడు బాకీకిగానూ ఇండ్లు 'ఆయికం' పెట్టినట్ల రాసిస్తే సరిపోతుందన్నా"

ఇల్లు ఆయికం అంటూనే నారపరెడ్డికి శరీరమంతా వొణికి నట్లయింది. నోరు ఎండుకపొయ్యింది. కదుపులో చెయిపెట్టి తిప్పినట్టు అయింది. అట్లాగే కళ్లు మూసుకున్నాడు.

'వొర నా కొడకా. యేమి యెత్తురా! బిదా బిక్కీ కదుపు మాడి దెగ్గిరికొస్తే కొంపలు ముంచుతార్రా మీరు. నిజానికి రాక్షసులంటే యాడో లేరు. అంతా మీరే'గొనుక్కున్నాడు నారపరెడ్డి.

'అంతపెద్ద ఇండ్లు పదైదువేలకే ఆయికం పెట్టేది యెట్ల? ఇంగా వొగ అయిదు వేలు అడిగితే బాగుంటుందా? మల్లా బాకీ శానా అయితే తీర్చేది యెట్లబ్బా? తీర్చకుంటే అంత యిండ్లు మల్లా సంపాయిచ్చుకుండేకి అయితుందా?

వొడ్డికి వొడ్డి యేసి కడాకు ఇండ్లు దక్కనీకుండా చేస్తారేమో'

రాయివేసి లేపిన కందిరీగలన్నీ తెట్టె చుట్టూ గిర గిర తిరిగినట్టు ఆలోచనలన్నీ కాసేపు నారపరెడ్డి తల చుట్టూ తిరిగాయి. నోట్లో మాటలు రాలేదు. కంటిరెప్పలు అల్లాడ లేదు. చూపులెక్కడో వున్నాయి.



'దీపకన్య' చిత్రం: బి. లలితాంబ

"ఏమన్నా మరి యేమనుకుంటాండావు" ఈసారి రంగయ్యే తొందర చేశాడు.'

"మల్ల వొడ్డీ యెంతేసుకుంటావప్పా?" నీరసంగా నారపరెడ్డి

"చూడన్నా. నేను ముందే చెప్పినాను. ప్రస్తుతానికి నాదగ్గర లెక్క లేదని. నీ కోసరం యెక్కడయినా తెచ్చి ఇవ్వల్సిందే. ఈ పొద్దు యెక్కడ చూసినా మూడ్రూపాయలు, నాలుగు రూపాయల వడ్డీ మామూలయిపోయింది. మీరేమో 'అబ్బా అంత వొడ్డీనా' అంటారు. మాకు మాత్రం మీ మీద బరువు మోపల్లని వుంటుందేమన్నా? మాకు కావలసిన రైతులను పోగొట్టుకుంటామా? టవున్లో షావుకార్లకు నచ్చజెప్పల్ల,వాళ్ల దగ్గర తీసుకొని వచ్చి మీ అవసరాలు తీర్చల్ల. తీర్చకుంటే తప్పతుందేమన్నా?" పరుల కోసమే బతుకుతున్నట్టు రంగయ్య కథలల్లాడు.

రంగయ్య నాటకం ఆడుతున్నాడన్న విషయం నారపరెడ్డికి అర్థమయింది. మూడో, నాలుగో అంటే కొంపలు ముంచే వడ్డి. ఇంకెందుకులే వెళ్లి పోదామనుకున్నాడు. లాస్టుకు రంగయ్య నోటిగుండానే వడ్డి ఎంతంటాడో తెలుసుకుందామనుకొని"ఇంతకూ వొడ్డి యెంతో చెప్ప రంగయ్యా నానబెట్టకుండా"అని అడిగాడు.

"చెప్పతాండాను గదన్నా. టవున్లో అడగల్ల తెచ్చి ఇయ్యల్ల, మరి వాళ్లు వడ్డి యెంతేసుకుంటారో యేమో! అందుకని రెండున్నర యేసుకొని నోటు రాసీయన్నా" బయటపడ్డాడు రంగయ్య.

నారపరెడ్డి కాసేపు ఆలోచించి వొప్పకున్నాడు. అనంతపురానికి వెళ్లి డబ్బు తెచ్చేసరికి సాయంకాలం అవుతుందని మరుసటి రోజు రమ్మని నారపరెడ్డికి చెప్పి లోపలికెళ్లాడు రంగయ్య.

నారపరెడ్డి దిగులుగా బరువుగా ఇల్లు చేరుకున్నాడు. జరిగినదంతా విని చెన్నమ్మ బాధపడింది. పెద్దలు సంపాదించిన ఆస్తి దక్కకుండా పోతుందేమోనని విచారపడింది. తరతరాల పరువు గంగలో కలిసిపోతుందేమోనని మథనపడింది. సరి కులస్తులు యేమనుకుంటారేమోనని దిగులు పడింది. చివరికి పరువు కంటే బతుకు ముఖ్యమని గుండెనిబ్బరం చేసుకుంది. బాధపడుతున్న భర్తను వోదార్చింది. బాకీలు చేస్తున్నది బాగుపడ్డానికేననీ భగవంతుడు లేకపోలేదనీ ధైర్యం చెప్పింది.

నారపరెడ్డి అమ్మిడిపొద్దు ముద్ద తిని టువ్వాల భుజమ్మీద వేసుకొని సాయంకాలానికల్లా తిరిగొస్తానని మర్తాడుకు బయలుదేరాడు.

"చెప్పలన్నా యేసుకొనిపో శానా యెండగా వుంటాది" అంటూ చెన్నమ్మ వాకిలి దగ్గర కింద పక్క గూట్లో వుండే పాత చెప్పలు బయటికి తీసింది. ఒకదానికి 'వుంగటం' కుట్లు వూడిపోయాయి. చెన్నమ్మ 'జెగిలి' మీద అద్దం పక్కనున్న గూట్లో వెతికి చిన్న మేకును తెచ్చిచ్చింది. నారపరెడ్డి గుండ్రాయి తీసుకొని చెప్ప వుంగటానికి మేకు కొట్టి సరిచేసుకున్నాడు. చెన్నమ్మ వక్కాకు సంచిలో నుంచి చిల్లర దుడ్లు తీసి మొగునికిచ్చి "తిరిగొచ్చేతప్పుడు బస్సుకన్నా రా" అని తాపత్రయంగా చెప్పింది.

నారపరెడ్డి చేలలో 'సీలు' దావగుండా మర్తాటికి నడుస్తున్నాడు. తలమీద 'వొల్లి' గుడ్డ వేసుకున్నాడు. వుంగటం దగ్గర కుడికాలి బొటనవేలికి చెప్ప మేకు గుచ్చుకుంటూ వుంది. ఒక పక్క రంగయ్య మాటలన్నీ గుర్తుకొస్తున్నాయి. గువ్వగూడంత వుండే అంగడీ, అంగట్లో చెక్క పెట్టె మీద కూచొని సుఖంగా సంపాదిస్తున్న రంగయ్యా, వొల్లో దంతెలకు ఆనుకొని వున్న మూటలూ కనిపిస్తున్నాయి... 'ఈనెమ్మ కదుపు కాలా. యెంత సులబంగా సంపాయిస్తాండారప్పా. ఆ జానెదు అంగిట్లో సరుకంతా యెదురుకున్నా అబ్బబ్బా ,అంటే అయిదువేలు చెయ్యదే. ఇతగానికి సెంటు మడికయ్య లేకపాయ, అరసెంటు చేనూ లేకపాయ. కొంపలో చూస్తే యెనభై తొంభై మూటలు వొడ్లూ, నూరూ నూటాయిరవై మూటలు శెనిక్కాయలూ. ఈ పొద్దు యార్రైతింట్లో ఆమాత్తరం 'మాసూలు' వుండాది? తెల్లార్లూ పగలల్లా కస్టం చేసినా కదుపునిండా తినడానికే దొరకడం లేదు. పండగ నాడన్నా పిల్లోల్లకు రొందు మంచి గుడ్డలు తీసియ్యేల్లంటే చాతకావడంలే. మల్ల ఈల్లేమో ఇంట్లో నుంచి అదుగుదీసి అదుగు బయటికి పెట్టకపోయినా కదుపునిండా సుకంగా తింటాండారు. కంటి నిండా నిద్రబోతాండారు. యెప్పుదు చూసినా కొత్త బట్టలు యేసుకున్నట్లే వుంటాది. సమ్మత్సరమంతా పండుగ చేసుకున్నట్లే వుంటాది....బిడ్డ పెండ్లికి వొగటిన్నర లక్ష కర్చయిందంట!.....వొరి ఈనెమ్మ, ఎంత బాగుందప్పా లోకమూ' ఆలోచనలతో నారపరెడ్డికి దారి నడిచినట్లే లేదు. మర్తాటికి చేరుకున్నాడు.

* * * *

సుబ్బిరెడ్డి కరెంటు మోటారు పెట్టి బావిలో నీళ్లన్నీ బయటికి కొట్టేశాదు. మర్తాటి గొల్లగంగన్న కాళ్లూ ముఖం కదుక్కొని పళ్లెంలో టెంకాయా తాంబూలం పెట్టుకొని కంచు చెంబునిండా నీళ్లు తీసుకొని బావి

లోకి దిగుతూ మొదటి మెటిక దగ్గర ఆగి పళ్లెంలో ఇరవై రూపాయలు దక్షిణ పెట్టమన్నాడు. నారపరెడ్డి నీళ్లు నములుతూ ఇరవై రూపాయల నోటు పళ్లెంలో వేశాడు. గంగన్న టెంకాయ కొట్టి బావిలోకి దిగాడు. అతని వెనకాలే నారపరెడ్డి దిగాడు. గంగన్న బావి నాలుగు మూలల్లో నాలుగు కట్టెలు నాటాడు. దరులన్నీ యెగాదిగా చూసి 'సట్టు' బాగలేదన్నాడు ఒక్కొక్క కట్టె దగ్గర తలొంచి చెవి పెట్టి విన్నాడు. అదంతా తండ్రీ కొడుకులు ఆసక్తిగా చూస్తున్నారు. కడాకు గంగన్న దేవర మూల నాటిన కట్టె దగ్గర నిలబడి మూడు నాలుగుసార్లు తలొంచి చూసి దడి మీద కనిపించే రాతి పొరను గమనించి ఆ పొరగుండా చూపును కిందికి దించి గుడ్లన్నీ మిటకరించి వొకచోట కట్టెను గట్టిగా నాటి వూదుకడ్డి ముట్టించి టెంకాయ కొట్టాడు. గంగమ్మ తల్లికి మొక్కొని అక్కడ బోరింగు వేయించమనీ, రెండించెలు నీళ్లు పడతాయనీ చెప్పి గడ్డకొచ్చాడు గంగన్న.

నారపరెడ్డి మవునంగా బయటికొచ్చి మాట్లాడుకున్న ప్రకారం నూర్రుపాయలు గంగన్న చేతిలో పెట్టి సాగనంపాడు.

* * * *


బోరింగు మిషనొచ్చింది. సుబ్బిరెడ్డి మోటారు పెట్టి బావిలో నీళ్లు చుక్క లేకుండా బయటికి కొట్టేశాడు. గంగన్న గుర్తు పెట్టిన పాయింటు దగ్గర డ్రైవరు బోరింగును కూచోబెట్టాడు. బావిగడ్డ మీద బోరింగు మిషను చెవులు తూట్లు పడే విధంగా శబ్దం చేస్తూ ఆడుతూ వుంది. చుట్టుపక్కల తోటల వాళ్లంతా గుంపయినారు. ఒకరి మాట ఇంకొకరికి వినిపించడం లేదు. రబ్బరు పైపులు నుంచీ గ్యాసు సాధ్యం లేకుండా వస్తూ వుంది. దాని ఫోర్సుకు ఇనపరాడ్డు గిరగిరా తిరుగుతూ వుంటే యెద్దు తుమ్మినట్లు గ్యాస్ చుక్ చుక్ మంటూ బయటికి చిమ్ముతూ వుంటే అందరూ వినోదంగా చూస్తున్నారు. డ్రైవర్ బోరింగ్ వేసే 'బిట్టు' తగిలించాడు.

ఇంక బోరింగు వెయ్యల్ల. సుబ్బిరెడ్డి బోరింగు బిట్టుకు పూజ చేసి టెంకాయ కొట్టి మొక్కున్నాడు. తాంబూలంలో వొక కొబ్బరి చిప్ప పెట్టి డ్రైవరు చేతికి ఈబోయాడు. డ్రైవరు దక్షిణ పెట్టమన్నాడు. నారపరెడ్డి అయిదు రూపాయలు తాంబూలంలో పెట్టాడు.

"యేందన్నా అయిదు రూపాయలా? మేమింతవరకూ యెక్కడా చూల్లేదన్నా యిట్లా దక్షిణ?" అని మొగం చీదరించుకున్నాడు డ్రైవరు. ఇరవై పెట్టమన్నాడు.

"వొరి నీ పాసుగులా అందరూ పీక్కతినే వాల్లే గదప్పా" అని గొణుగుతూ నారపరెడ్డి ఇరవై తీసి తాంబూలంలో పెట్టాడు.

డ్రైవర్ మీట నొక్కాడు. బోరింగు సౌండు ఎక్కువయింది. బోరింగ్ బిట్టు నేలను ధన్ ధన్‌మని గుద్దుతూ చూస్తూ వుండగానే రెండడుగులు లోపలికి దిగింది. సుబ్బిరెడ్డి బయటకొచ్చి అందరికీ కొబ్బరి ప్రసాదం పంచాడు. నారపరెడ్డి బావిలో నిలబడి బోరింగు పక్కే గమనిస్తున్నాడు.



బోరింగు లోపల్నుంచి యెర్ర 'గరుసుపొడి' బయటికొచ్చి చుట్టూ పడుతూ వుంది. చిన్నగా నీళ్లు బయటికి చిమ్ముతున్నాయి. మాటిమాటికీ కేసింగు పైపు దగ్గర పడుతూ వుండే మట్టిని తీసుకొని తెలిసిన వాళ్ల మాదిరి పరీక్ష చేస్తూ తలాకొకమాట మాట్లాడుతున్నారు పక్కనున్న వాళ్లు.

"సట్టు బాగానే వున్నెట్లుంది మామా. బోరు మెత్తగా దిగుతాంది"

"యాభై అడుగుల్లోనే దండినీళ్లు పడచ్చు నన్నా"

"అబ్బబ్బబ్బా.... గాలికి యేం పవరు పెట్నాడు మామా. అంతెంత ఇనపరాడ్లు గాలి దెబ్బకు లోపలికట్లే చించుకొని పోతుండాయి. యెవుడు కనిపెట్టినాడో వానెమ్మ కడుపుగాలా"

నారపరెడ్డి మాత్రం ఇవేవీ వినకుండా కన్నార్పకుండా బోరింగు పక్క తదేకంగా చూస్తున్నాడు.

బోరింగు లోపల్నుంచీ తెల్ల మన్నుతో పాటు కొద్దికొద్దిగా నీళ్లొస్తున్నాయి. నారపరెడ్డి ముఖంలో సంతోషపు కవళికలు ఆడుతున్నాయి. శరీరానికి ఏదో తెలియని తృప్తి కలుగుతూ వుంది. సుబ్బిరెడ్డి పట్టపగ్గాల్లేకుండా రెండు కాళ్లొక చోట పెట్టకుండా తిరుగుతున్నాడు. చిన్న తమ్ముడ్ని వూళ్లోకి పంపి మరో టెంకాయ తెప్పించి బోరింగు దగ్గర కొట్టాడు.

చెన్నమ్మ ఇరవై మందికి అయ్యేంత అన్నమూ, పప్పూ, చారూ గంపలో పెట్టుకుని నడిపోడు కొండారెడ్డితో పాటు మోసుకొని వచ్చింది. సుబ్బిరెడ్డి బోరింగు వాళ్లనూ చుట్టుపక్కల తోటల వాళ్లనూ భోజనానికి పిలిచారు. ఆ వూర్లో ఎవరు బోరింగు వేయించినా తిర్నాల జరిగినట్లే. భూమి ఆసామి ఇంట్లో సన్నపాటి పెళ్లయినట్లే. ఆ పూట పదిమందికి అన్నం పెడితే గంగమ్మ తల్లి సాయపడుతుందని వాళ్ల నమ్మకం.

నారపరెడ్డికి అన్నం తినాలనిపించలేదు. కేసింగు పైపు దగ్గర కూరుకుపోతూ వున్న మట్టిని పారతో పక్కకు లాగి నిలబడి చూస్తున్నాడు.

"సుద్ద సట్టేమో బాగనే వొచ్చింది. నీళ్లూ పరవాలేదు. ఈసట్టు ఇట్లే అయిదారడుగులు వొస్తే నీళ్లకేం బయముండదు. అద్రుస్టం యెట్లుందోయేమో'

డ్రైవరు అన్నం తిని వచ్చి క్లీనర్ని పక్కకు రమ్మని మీటనుగట్టిగా నొక్కాడు. తూములో నుంచీ నీళ్లు బయటికొచ్చినట్టు బోరింగులో నుండి నీళ్లు పైకొచ్చాయి. నారపరెడ్డి కళ్లు పెద్దగయ్యాయి. రెండు క్షణాలయ్యాక నీళ్లు మామూలుగానే రాబట్టాయి.

అన్నం తిని వచ్చి కొంతమంది బావిలోకి దిగి బోర్లో వస్తున్న నీళ్లను గమనించసాగారు. కొంతసేపటికి నీళ్లు రంగు మారసాగాయి. నల్లగా తొక్కుడు నీళ్ల లాగా మురుకులొచ్చాయి. ఒకరిద్దరు నీళ్లల్లో వస్తున్న మట్టిని తీసుకొని చూసి చప్పగయ్యారు.

"దీం దుంప తెగా ఇదేందన్నా కాకి మారు సట్టు వొస్తాంది" అని పెదవులు విరిచాడొకడు. నారపరెడ్డి మనసు బరువు కాసాగింది. శరీరంలో నిస్పత్తువ చోటు చేసుకుంటున్నది.

డ్రైవరు ఒద్నాలుగో రాడ్డును బిట్టుకు తగిలించి ఎనభై అడుగులు వేసినట్టు చెప్పాడు. ఇప్పడు మొత్తం నల్లసట్టే వస్తూవుంది. అది ఎంతవరకు వుంటుందో అంతదాకా నీళ్లు పడవన్నారు. సుబ్బిరెడ్డి ముఖం పాలిపోయింది. నారపరెడ్డి పెదవులు ఎండుకుపోయాయి. బావి గడ్డ మీదున్న వాళ్లంతా వొక్కక్కడే వెళ్లిపోతున్నాడు. నారపరెడ్డి బావిలో దిష్టిబొమ్మలాగా నిలబడి చూస్తున్నాడు. పక్కనున్న వాళ్లు తలాకొక మాట మాట్లాడారు. ఏమయినా సరే ఇంకో ఇరవై అడుగులు వేయించేది మేలన్నారు. నారపరెడ్డి చప్పగా కొడుకు ముఖం చూశాడు. సుబ్బిరెడ్డి గట్టిగా వూపిరి వదిలి నూరడుగులు దాకా వేయండని డ్రైవరుకు సైగ చేశాడు.

ఇంక ఇరవై అడుగుల్లో తసరాతేమన్నా మారుతుందేమోనని యెదురు చూస్తున్నాడు నారపరెడ్డి. బోరింగులో కొత్త శబ్దమొచ్చింది. డ్రైవరు రెండు, మూడుసార్లు మీటను పైకీ కిందికీ నొక్కాడు. నీళ్ల గుండా గట్టి రాయి రవ్వ లొస్తున్నాయి. బోరింగు కిందికి దిగడం లేదు. డ్రైవరు బిట్టుతో ఏడెనిమిది సార్లు గుద్దించి తలవూపి బండ పడిందన్నాడు.

"థూ దీనెమ్మ" అంటూ సుబ్బిరెడ్డి పైకెక్కిపోయాడు. నోట్లో మాటలు రాక నిలిపేయండని చేత్తో సైగ చేశాడు నారపరెడ్డి. బోరింగు శబ్దం నిలిచిపోయింది. వానొచ్చి వెలసినట్టు నిశ్శబ్దంగా వుంది.

బోర్లో ఎన్ని నీళ్లు రావచ్చునని యెవరో అడిగారు. డ్రైవరు గేజి పెట్టి వొకటిన్నర ఇంచి నీళ్లు రావచ్చునన్నారు.

"యెట్లోలే. గుడ్డి కంటే మెల్ల మేలు గదా"

"యాదానికన్నా అదురుస్టముండలప్పా" అంటూ

అందరూ బయటికొచ్చారు. తన బతుకు వెక్కిరించేలాగున్న వాళ్ల మాటలు వింటూ నారపరెడ్డి తలొంచుకొని మవునంగా పైకొచ్చి మిషను రూము దగ్గర బండ మీద కూలబడ్డాడు.

డ్రైవర్ బోరింగు సామాన్లన్నీ ట్రాక్టర్లో వేయించి నారపరెడ్డి దగ్గరికొచ్చి కూచున్నాడు. మొత్తం నాలుగు వేలా తొమ్మిది వందలా యాభై రూపాయలివ్వాలన్నాడు. నారపరెడ్డి వేసుకున్న అంచనా తారుమారైంది. అసహనంగా చూశాడు. డ్రైవర్ రకరకాల లెక్కలు చదివాడు. కేసింగు పైపూ, డ్రైవర్ మామూలు, బత్తా అంటూ లిస్టు చెప్పాడు. నారపరెడ్డికి వినే వోపిక గానీ, అదెందుకు ఇదెందుకని అడిగే చైతన్యం గాని లేదు. జేబులో నుంచీ యాభై రూపాయల నోట్ల కట్ట తీసి ఒక నోటు పక్కకు తీసుకొని మిగతా కట్టంతా డ్రైవర్ చేతికిచ్చాడు. డ్రైవర్ నిదానంగా లెక్కపెట్టుకుని అయిదువేలకు యాభై తక్కువుందన్నాడు. 'సరిపోయింది గదా ఇంకేం' అన్నట్లు చూశాడు నారపరెడ్డి.

"ఆ యాభై ఇట్లీయన్నా సరిపోతాది. వొకరకంగా నీళ్లు పడినా నూటికి తక్కువ కాకుండా ఇనాముగా ఇస్తారు. ఇంతమంది వున్నాం. తలాకొక పదన్నా వొద్దేమన్నా?" డ్రైవర్ గట్టిగా కొసిరాడు.

నారపరెడ్డి ఇంకేమీ మాట్లాడలేదు. కాయిలా పడిన మనిషి లాగా మెత్తగయినాడు. బయటికి రాని వెతనంతా లోపలే మింగి ఆ యాభై రూపాయల నోటు డ్రైవర్ చేతిలో పెట్టి బరువుగా నిట్టూర్చాడు.

బోరింగు వెళ్లిపోయింది. చుట్టుపక్కల వాళ్లంతా సాగిపోయారు. భార్యాపిల్లలతో నారపరెడ్డి వూర్లోకి యెల్లబారినారు. అందరూ దారి వెంట మవునంగా నడుస్తున్నారు. గాలి వేగానికి తట్టుకోలేక మేఘాలన్నీ అనాథల్లాగా తిరుగాడుతున్నాయి.

* * *

రోహిణీకార్తి వెళ్లిపోవచ్చింది. సాయంకాలం కాగానే అక్కడిక్కడ మెరుపులు కనిపిస్తున్నాయి. ముంగారి విత్తనం వేసుకునే రైతులంతా వాన కోసం యెదురు చూస్తున్నారు. వేరుశెనగ విత్తనం వేసే రైతులు పుష్యమికార్తి, వేరుశెనగకు మంచి తటి అని ఇప్పుడు నాలుగు చినుకులు పడితే ముంగారి సేద్యాలు చేసుకోవాలనుకుంటున్నారు.

సుబ్బిరెడ్డి చీనా చెట్ల కింద పాదులు చేస్తూ వున్నాడు. వొళ్లంతా చెమట పట్టింది. బనియను తడిసిపోయింది. ముక్కు మీద నుంచీ గడ్డం మీద నుంచీ చెమట బిందువులు కిందికి జారిపోతున్నాయి.

చేతిలో పార పట్టుకొని చీనా చెట్ల కింద వొంగి నంక మొత్తం పాదంతా గడ్డి దోకేది అయిపోయే వరకూ పైకి నడుమెత్తే రకం కాదు సుబ్బిరెడ్డి. తోటలో యెక్కడన్నా కలుపుమొక్క కనిపిస్తే చాలు శత్రువును చూసినట్టు చూస్తాడు. సుబ్బిరెడ్డికి తోటే లోకం. నేల తల్లంటే ప్రాణం. మడక కట్టి మేడితోక మీద చేయి వేసి కుడిచేతిలో సొలకోల పట్టుకొని గిత్తలను కొట్టకుండా మడక తోలడమంటే మట్టసంగా కోండ్ర వెయ్యాలంటే చక్కగా గెరిగీసినట్టు గుంటక పోయాలంటే పరమానందం అతగానికి. ఇంకా చీనా చెట్లంటే వల్లమాలిన ప్రేమ. రెండేండ్ల నుంచి పంట సరిగా రాకపోయినా యెప్పుడో వొకసారి పంట చీల్చేస్తాది, దరిద్రమంతా తెగిపోతాదని గట్టి నమ్మకం. ఆ నమ్మకమే యెంత పని చేసినా అలసట కలగనీయడం లేదు.

'ఇంటి పరిస్థితులు బాగాలేవు. ప్రతిదానికీ కూలి పెట్టి పని చేయిచ్చుకోవాలంటే సేద్యం గిట్టదు. కూలికి వొచ్చినోళ్లు టైము చూస్తా పని చేస్తారు. చేసిన పనయినా సరిగా వుంటుందా అంటే అదీలే. యాడ కలుపు ఆడే పెడతారు. చీనా చెట్ల మొదుల్ల దగ్గర పారతో శానా వొనారుగా గడ్డిదోకల్ల. లేకుంటే మొదుల్ల కాడ పారకచ్చులు పడి బంక కారుతాది. బంక కారితే చెట్టు దెబ్బ తింటుంది. దెబ్బ తింటే వాళ్లదేం పోతుంది.

చేతికొచ్చిన చెట్లను పిల్లోల్ల మాదిరి చూసుకోవల్ల. నిదానంగా దినానికి యాభై పాదులు చేసుకుంటే ఆరు దినాల్లో అన్నీ అయిపోతాయి. ఈ పనంతా అయిపోయినంక కటింగు మొదలుపెడితే సరిపోతాది. చెట్లల్లో వుండే చిదుగంతా తీసేసి కటింగు బాగా చేసుకోవల్ల' అలుపూ సలుపూ లేని ఆలోచనలతో చెట్టుకింద పాదులో గడ్డి దోకేస్తున్నాడు సుబ్బిరెడ్డి.

సుబ్బిరెడ్డిని చూస్తూనే నారపరెడ్డికి వొళ్లు పులకరించింది. కడుపు చల్లగయింది. కళ్లు చెమ్మగిల్లాయి. కొడుకు పక్క చూస్తూ అట్లాగే నిలబడ్డాడు.

......తన రక్తంతో పుట్నోడు. అన్నీ తన బుద్ధులే. యేంపని చెప్పినా గసుకు యేయికుండా చేస్తాడు. పనిలో యెంత వొనారనీ? యాడ నేర్చుకుండాడో దొంగబడవ. ఈ వొయిసుకే సంసారమింద దిగులు. అయిగా తిని తిరగాల్సినోడు. అప్పుడే నా బరువంతా నెత్తికి యెత్తుకుండాడు. యేందో లేకి బతుకు' అనుకుంటూ కొడుకు దగ్గరికెళ్లాడు నారపరెడ్డి. తండ్రి చాలంటున్నా మళ్లీ రెండు పాదులు చేసి పైకి లేచాడు కొడుకు. తొట్టి దగ్గరికెళ్లి చెమట పట్టిన వొళ్లంతా కడుక్కొని పచ్చిగడ్డి మోపెత్తుకున్నాడు. ఇద్దరూ వూర్లోకి దానబట్టారు. మాటలు నడుస్తున్నాయి.

"ఆరెద్దల కార్తి వొస్తానే శాడకట్టి శెనిక్కాయి యేసుకుందామప్పా"


"అంత ముందుగా యేసుకుంటే యెట్ల నాయనా? యెనికిల్ల వానలు రాకుంటే కష్టం గదా"

"బోరింగు యేసుకున్నేక నీళ్లు రొంతమేలు గదప్పా. ఎకరా శెనిక్కాయి పారబెట్టుకోలేమా?"

"యాడయితుంది నాయనా అనుకున్నట్ల చీనా చెట్లు వాడు బట్టి పంట తగులుకుంటే గాలి కాలానికల్లా గోలీ గుండ్లంత పిందెలు యేర్పడతాయి. అప్పుడు కనీసం అయిదారు దినాలకు వొకసారన్నా చెట్లకు తడిపెట్టల్ల. ఆగాలి కాలంలో దినానికి అర్ధెకరా నీళ్లు పారాలంటే గగనమయితాది. అట్లాటప్పుడు వానరాకుంటే చెట్లూ, శెనిక్కాయి బాయినీళ్లతో తడుపుకోవల్లంటే శానా కష్టమయితాది"

నారపురెడ్డి, కొడుకు ముందు చూపును గ్రహించుకున్నాడు. పుష్యమి కార్తిలో శెనిక్కాయ విత్తనం వేసుకుంటే మఖ, పుబ్బల్లో నాలుగు చినుకులు పడితే బావి నీళ్లతో అవసరం లేకుండా వేరుశెనగ బయట పడుతుందనుకున్నారు. ఒకవేళ చినుకులు పడకపోయినా వాతావరణం చల్లబడి వుంటుంది కాబట్టి బావి నీళ్లతోనే కష్టపడి పంట పండించుకోవచ్చునసుకున్నారు. ప్రస్తుతానికి వరినార పోసుకుంటే మేలన్నాడు నారపరెడ్డి. కోయంబత్తూరు వడ్లే మేలన్నాడు. పశువులకు దండిగా మేత వస్తుందన్నాడు. పశువుల మేత దినేసరికి సుబ్బిరెడ్డికి ఇరుగుపొరుగు వాళ్ల దొడ్లన్నీ కనిపించాయి. ఒక్క దొడ్లో కూడా బారెడు గడ్డివామి లేదు. పశువులన్నీ డొక్కలు కనిపించాయి. ఒక్క దొడ్లో కూడా బారెడు గడ్డివామి లేదు. పశువులన్నీ డొక్కలు వేలాడేసుకొని వున్నాయి. తమ దొడ్లో మాత్రం ఇంకా మూడు బారల గడ్డివామి మిగిలే వుంది. అందరి మాదిరి నిరుడు హంసవడ్లు వేసుకుని వుంటే ఈపాటికి దొడ్డి బోసిపోయి వుండేది.

దీర్ఘకాలం పంటయినా కోయంబత్తూరు వడ్లే ఆరుద్రకార్తిలో వేయాలనుకున్నారు తండ్రీ కొడుకులు. దిబ్బలో వుండే పశువుల ఎరువు వరి మడికీ, వేరుశెనగకూ చాలదన్నారు నారపరెడ్డి. ఒక జీతగాడ్ని పెట్టుకొని వుంటే మనిషికి మనిషి తోడుగా వుండేది. పనులు బరువు లేకుండా జరిగేవి. పనిలేనప్పుడు



ఆకూ అలమూ, చెడిదీ పడిదీ పశువుల కిందికి వేస్తే దిబ్బలో కసువు దండిగా పడేది. రెండు సంవత్సరాలవుతుంది చెట్లు ఎదిగినప్పటి నుంచీ మడికి గంపెడు యెరువెయ్యడం లేదు.

జీతగాని వూసెత్తితే సుబ్బిరెడ్డి వొప్పకోవడం లేదు. బరువవుతుందని అంగలారుస్తాడు. 'వానలే సరిగా పడడం లేదు. అట్లాటప్పడు ఆకూ అలమూ ఎక్కడ పెరుగుతుంది. పొలమంతా తిరిగినా నాలుగు వెంపలి చెట్లూ, పిడికెడు తంగిడాకూ చిక్కదు. కానగాకు అంటే దాని వాసనే లేదు. కడాకు జిల్లేడు చెట్లు కూడా కనిపించవు. అటువంటప్పడు జీతగాడు వుండీ యేం చేస్తాడు? ఈ కాలంలో జీతగాడ్ని పెట్టుకుంటే కొరివితో తల గోక్కున్నట్లే. ఎవడూ సరిగా పనిచేయడు. చిన్న పిల్లనాయాల్ని జీతం పెట్టుకోవాలనుకున్నా వేలు వేలు అడ్వాన్సు అడుగుతారు. జీతం పెట్టుకున్న తర్వాత వాళ్లకు సమస్తం చూడాల. వారానికొకసారి సారాయి నీళ్లకు ఇవ్వాల. ప్రతిదినమూ కట్ట బీడీలు అర్సించుకోవాల. సినిమాలు చూపించాల. ఇంతా చేస్తే అతగాళ్లు సరిగా వుంటారనేది నమ్మకం లేదు. ఇంక ఒక్కొక్కడయితే గంపెడు కూడు తింటాడు. వాళ్లను మేపడమంటే 'ఏనుగును మేపడమే. ఆ జీతగాళ్లూ వొద్దు. వాళ్లు కుప్పజేసే ఎరువూ వొద్దు. గొర్లమంద తోలించుకుంటే సరిపోతుంది.'

సుబ్బిరెడ్డి ఆలోచనే సరైందనుకున్నాడు నారపరెడ్డి. వరినాటుకునే నేలకూ వేరుశెనగ వేసే నేలకూ గొర్లమంద తోలించమన్నాడు. తాను కొప్పలకొండకెళ్లి పెద్దబిడ్డను చూసి వచ్చేస్తానన్నాడు. తండ్రీకొడుకులు బతుకును గురించి రకరకాలుగా మాట్లాడుకుంటూ వూరు చేరుకున్నారు.

* * *


ఎండ తీవ్రంగా వుంది. గొర్లు తుమ్మకాయ మేస్తున్నాయి. చెట్టు కింద నిలబడి కట్టె వూత బొడుసుకుని 'యాలపదాలు' పాడుతున్నాడు గొర్ల మల్లేసు. కాళ్లల్లో బెత్తెడెత్తు కిర్రు చెప్పలు. 'సల్లడం' మీద మొలతాటికి 'మల్లి ముళ్లూ' బీగం చెవుల గుత్తీ, నాలుగైదు పిన్ని సూదులు, చిన్న చాకూ వేళాడబడ్డాయి. చేతుల బనియను చెమటకు అట్టగట్టింది. నెత్తిమీద పాత కంబడేసుకొని సంకలో సద్ది కూడున్న 'చిక్కెం' తగిలేసుకున్నాడు మల్లేసు. గొంతెత్తి యేవేవో పాడుతూ తన సామ్రాజ్యంలో తానొక్కడే మునిగి తేలుతున్నాడు. వాని అనిబద్ధమయిన సంగీత స్వరాలు ప్రకృతి శబ్ద తరంగాలలో లీనమైపోతున్నాయి.

"యేం మామా. యాల పదాలు శానా జోరుగా పాడతాండావే?" అంటూ సుబ్బిరెడ్డి చీనా చెట్లల్లో నుంచీ బయటికొచ్చాడు.

"అల్లుడు యినల్లని పాడతాండానోయ్" జాంతనమాడాడు మల్లేసు.

"అల్లుడు గిల్లుడని అంటాండావు. ఓడ్డనేమున్నా ఇస్తావేం మామా?"

"నీ యట్లా అల్లుడు దొరకల్ల గానీ బంగారమా కట్ల ఈయనా సామీ"




"నువ్వేమో ఇస్తావులే. నీ కర్రిబిడ్డను ఎవుడు చేసుకుంటాడు? బిడ్డెత్తు బంగారు పెట్టాల్సిందే."

"పేదోల్లం సామీ. బంగారు యాడపెడతాం? యేందో గంతకు తగిన బొంత దొరక్కుండానే పోతుందా? "

"సరేగానీ ఇప్పడు గొర్లమంద యాడ తోల్తాండారు మామా?"

"దిగవ పొలంలో తోల్తాండాం దొరా. యేం మనకేమన్నా కావల్నా?"

"అవును మామా. వొగనాలుగు దినాలు తోలిస్తే బాగుంటుందనీ...."

"తోల్తాం లేవోయ్. యాది పచ్చిమందా వొట్టిమందా? పచ్చిమందయితే వరి నార వచ్చినంక నాటే ముందు తోలితే మేలు. సేన్లో కూడా నీళ్లు పెట్టి యిత్తనం యేసుకుండేట్లయితే పచ్చిమందే మేలు. యామంద తోలమంటావు?"

"మందకు యామాత్రం తీసుకుంటారో....?"

"యెంతో గంత చూసి యేసుకుంటాము లేప్పా"

"అదిగో నీ కురవాటలు ఆడకుండా యెంతో కచ్చితంగా చెప్ప"

"సూడోయ్ సుబ్బిరెడ్డీ. మాది పెద్ద మంద సొట్టబెట్టా రెండు వేల జీవాలుండాయి. రెండు దినాలకే యకరా నేల తొక్కుతాయి. గొర్లు పండుకొని లేసినంక మల్లా యెరువు తోలే పనుండదు'

"సరే సరే మీ కురవతగాళ్లు అట్లనే చెప్తతార్లే గానీ పూటకు యెంత కరారు చేసినారో చెప్ప"

"యెంతన్నా యెంతలే అల్లుడా. ఇరవై సేర్లు బియ్యమూ, యాభై రూపాయలు లెక్కా. పది కట్టలు బీడీలూ, వొగకట్ట ఆకులూ, పావు వక్కపేల్లూ, పావు పొగాకూ ఇత్తాండారు" లిస్టు చదివాడు మల్లేసు.

"పాలేం మామా? కాపీలూ, టిపన్లు, సిగరెట్లూ వొద్దా?" యెగతాళి చేశాడు సుబ్బిరెడ్డి.

"అవన్నీ మాకెందుకులే సామీ తిక్క కురవోల్లకీ!" అంటూ మల్లేసు గొర్లను అదిలించాడు.

"అబ్బబ్బబ్బా......మీరు తిక్క కురవోల్లా మామా. అందికేనా యాటా యాటా పోటీ పడి భూములు కొంటాండేది? మీకుండే తెలివి యెవరుకుంది? పది సీమిడిగొర్లు పెట్టుకుంటే సాలు సమ్మత్సరం తిరక్కనే ఇరవై అయితాయి. అవేముంది. గాలికి తిరిగి పెద్దవయితాయి. గెడ్డి యెయ్యల్లే, నీల్లు పెట్టల్లే, మందు కొట్టల్లే అనే దిగులేముంది? రాత్రి పూట్ల యా పొలంలో పండబెట్టినా తిండికి బియ్యమొస్తాయి. కర్చులకు దుడ్లొస్తాయి. ఇంగ రేట్లంటావా, బాపనోల్లూ, కోమటోల్లు అందరూ తినబట్టి వొగ బడగొర్రిని అమ్మినా అయిదారు నూర్లకు తక్కువ పోదు. యాడబెట్టుకుంటారు మామా దుడ్లన్నీనూ?" కురవోళ్ల ఆదాయమంతా యెత్తిచూపాడు సుబ్బిరెడ్డి

"మీకేమోయ్ యెన్నయినా మాట్లాడతారు. గొర్లు తోలుకొని అడివికి పోతే తెలుత్తాది. వాన్లు లేక మేతల్లేక తాగేకి నీల్లు లేక అవి యెండకు వొగిరిచ్చి సత్తా వుండే పానం పోయినట్లయితాది. రాత్తిరనకా, పగలనకా, వాననకా, ఎండనకా, గాలనకా దాండ్ల యెంట తిరగల్లంటే మాటలేమప్పయా? అడివిలో గొర్లనిడిసి మీ మాదిరి ఇంటికిపోయి పెండ్లాం పిల్లల దెగ్గర వుండేకయితుందా? ఇదంతా వొగెత్తు, ఆ దొంగల కాటు యింగొగెత్తు. గొర్లు పెట్టుకోవడమంటే శానా కస్టం సుబ్బిరెడ్డీ" తన గొర్లకతంతా చెప్పాడు మల్లేసు.

సుబ్బిరెడ్డి, మల్లేసు చెప్పినదంతా విని యెవరి ఇబ్బందులు వాళ్లకున్నాయనుకున్నాడు. నాలుగు దినాలు తమ పొలంలో గొర్లు తోలించడానికి వొప్పించాడు. తుమ్మకాయ మేపుకున్నందుకు ఒకనాడు ఫ్రీగా మంద తోలల్లని కరారు చేశాడు. చీనా చెట్లకు ఎరువేస్తే వేడెక్కువయి, త్వరగా వాడొస్తాయని దిబ్బలో వున్న యెరువంతా తోలాడు సుబ్బిరెడ్డి. యాభై బళ్లయింది. చెట్టుకు అయిదు గంపలొచ్చింది. మంచి పేడ యెరువు. పాదులనిండా పడింది.

సుబ్బిరెడ్డి చెట్ల మొదళ్ల దగ్గర బంక కారకుండా చెదులు పట్టకుండా సున్నం, మైలు తుత్తా కలిపి పూశాడు. కటింగు చేసిన యెండు పుల్లలన్నీ చెన్నమ్మ, లక్ష్మీదేవీ బయటికి యెత్తి పోశారు. నారపరెడ్డి

అగ్గిపుల్ల గీసి ఆ పుల్లలన్నీ కాల్చేశాడు. తోటంతా లక్షణంగా కనిపిస్తూ వుంది.

ఆరుద్ర కార్తి వొచ్చింది. మెట్ట పొలం రైతులంతా ముంగారి వాన కోసం ఎదురు చూస్తున్నారు. అక్కడక్కడ దూరంగా అడపా దడపా వానపడుతూ వుంది.

కొత్తపల్లి కంసల ఆచారి యింటిదగ్గర సాయంకాలం అయ్యేసరికి సందడిగా వుంటున్నది. మడకలు చేయించుకునేవాళ్లూ గొర్రు దిండ్లు దిగగొట్టించుకునేవాళ్లు, కర్రులూ పలుగులూ తట్టించుకునేవాళ్లూ అందరూ చుట్టుకుంటున్నారు. ఆచారి 'పురసత్తు' లేకుండా కొలిమి దగ్గర కూచొని ఎర్రగా కాగిన కొరముట్లను కొలిమిలో నుంచి బయటికి తీస్తూ వుంటే రైతులు సమ్మెట్లతో సాగగొడుతున్నారు. పిల్లకాయలు ఉత్సాహంతో గాలి మిషను తిప్పుతున్నారు. అప్పుడు కాదిప్పుడు పొలాల్లో పనులు చేసుకోవల్లని అందరూ వానకోసం యెదురు చూస్తున్నారు.

* * *

చీనా తోట పై'చెలికి'లో గెనుము మీద కూర్చుని బీడీ కాలుస్తూ పడమర దిక్కు ముఖం పెట్టి ఎగువపల్లి కొండలకల్ల చూస్తున్నాడు నారపరెడ్డి. ముంగారి మాడాలన్నీ ఆలకూడి గూడుకడుతున్నాయి. మాడం కింద సన్నగా సారక లు ఏర్పడుతున్నాయి. వాన వొంగే సూచనుంది. గాలి చల్లగా వీస్తూ వుంది.

నారపరెడ్డి మనసంతా గుబులు గుబులు అవసాగింది. నోటి నిండా పొగ పీల్చి బీడీ ఆరిపేసి చెట్లల్లోకి నడిచాడు. చెట్టు చెట్టు దగ్గరా నిగాఃపట్టి చూస్తూ తోటంతా తిరిగాడు. ఉత్తరం మేరమీద నిలబడి మాటిమాటికీ మాడాల పక్కా, చెట్ల పక్కా దిగులుగా చూస్తున్నాడు –

'చెట్లన్నీ వాడు మొగం పట్టి మగ్గుతాండాయి. ఇంగొక పది దినాలు చినుకులు పడకుంటే బాగా వాడొస్తాయి. పూర్తి వాడు రాకముందే తేమయితే పూత రావడం కష్టమే. పూతరాకుంటే యెడగారు పంట రానట్లే. ఈ మద్దెలో యెప్పుఃడూ ఆరెద్దల కార్తిలో వానే వొంగలే. ఈసారేమో బగవంతుడు ఇట్ల చేస్తాండాడు? వాడొస్తే, ఈ కార్తి పొదలలో నీళ్లేస్తే సరిగ్గా వుగాది కల్లా పంట వొస్తాది. విరుడు పంట చూస్తే అట్లయిపాయ. ఈసారన్నా బూమమ్మ తల్లి బయటికి యేస్తుందేమో అనుకుంటే ఇట్లయితాంది. యెట్ల చెయ్యాలబ్బా!' ఆలోచిస్తూ నారపరెడ్డి మేరగెనుముదిగాడు.

'వూరందరిదీ వొక దారయితే వులిపి కట్టిది వొక దారి' అంటారు. అందురూ వానకోసం యెదురు చూస్తూవుంటే చీనా చెట్ల రైతులు మాత్రం ఇంకా కొద్ది రోజులు వానొద్దంటున్నారు. ఎవరి అనుకూలం యెట్లున్నా ఋతు ధర్మం ప్రకారం వానలొస్తే ఈ ఇబ్బందులుండేవి గావు.

నారపరెడ్డి వూర్లోకి యెల్లవారినాడు. వానొంగింది. పదునైంది. పొలాల్లో నీళ్ళు మెదిలాయి. నారపరెడ్డి తడిసి ముద్దయి పోయాడు. తలకాయలో నుంచీ నీటి చుక్కలు కారినట్లే అతని మనసులోని ఆశలన్నీ నీరుగారి పోయాయి. ఇల్లు చేరుకున్నాడు. చెన్నమ్మ



అంగలాసింది. సుబ్బిరెడ్డి సేద్యాన్ని తలచుకొని గొని గాడు.

తూరుపు తెల్లగయింది. రైతులంతా మడకలూ గుంటకలూ 'కోటేరు' వేసుకుని ఎలిపొలం సేద్యాలకు పోతున్నారు. ఎద్దుల కాండ్ల మధ్యలో మడక నగలు నేల మీద 'జిర్రు జిర్రు' మని రాకుతూ పోతున్నాయి. కొత్తపల్లి బావి గిలక సారిసారికీ 'కయ్ కయ్'మంటూ మోగుతూ వుంది. పిల్లోల్లు పశువుల్ని వూరిమందలోకి తోలుకుపోతున్నారు. ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు ఆవుల దగ్గరికొచ్చి తోకల కింద చెంబులు పెట్టి 'గంజుబొయి గంజుబొయి గవరమ్మా, గంజుబొయి గంజుబొయి గవరమ్మా' అని రాగాలు తీస్తున్నారు. ఆడపిల్లలు ముగ్గురు నలుగురు కింద పడిన పేడకాల్ల కోసం సిగపట్లు పట్టుకుంటున్నారు.

జీతగాళ్ళు గోనిపట్టలు 'కాప్పిరి' వేసుకొని పేడ కసువు గంపలు నెత్తిమీదికెత్తుకొని దిబ్బల్లో వేసొస్తున్నారు.

కొంతమంది 'గంజు'కడవలు భుజాల మీదికెత్తుకొని దిబ్బల్లో పోస్తూ వుంటే మురుగు వాసన చుట్టుపక్కలంతా వ్యాపిస్తోంది. నారపరెడ్డి 'చెంబు పట్టుకొని' పోయి తిరిగొస్తున్నాడు.

"యేమి నారపరెడ్డన్నా, చీనా చెట్లోల్లము గబ్బయి పోతిమే. దీనెమ్మ కడుపుకాలా, ఈ వాన యెటూ కాకుండా చేసెగదన్నా. ఇంగొక పద్దెదు దినాలు తట్టుకొని వుంటే ఎంత బాగుండేది! వొచ్చేదేదో వంకలు పారేటట్లన్నా వొచ్చింటే బాయిల్లో నీల్లన్నా రొంత వుబికిండు. ఇపుడొస్తే యెవురూ విత్తనాలు యెయ్యరుగదా! ఈ వాన ఎంతన్యాయం చేసెనన్నా!" అంటూ మునెప్ప బాధపడ్డాడు.

"ఏందో లేప్పా, అనుకుంటే కుల్లిసచ్చేతట్లయింది. రొంతన్నా చెట్లు మగ్గలేదు. ఇంగేమి పూతలు వస్తాయప్పా?" నారపరెడ్డి నిరాశ చెందాడు.

"ఇంగా యాపూతలన్నా? ఇగుర్లు కూడా నమ్మకంలే. ఇంగ ఎడగారుపంట మీద ఆశ యిడిసిపెట్టి గయిరంగం పెట్టుకోల్సిందే. గయిరంగమంటే మగ, వుబ్బ కార్తుల్లో వొరువు పెట్టుకొని చినుకులు పడకుంటే తగులుకుంటుంది. అదీ తప్పొయ్యిందిరా అంటే కడాకు * సీజనే గతి."

'ఏమయితే మనం చేసేది యేముందప్పా? ఈ గడ్డ మీద రైతు బతుకే ఇట్లయ్యింది. శెనిక్కాయికి వానలు సకాలంలో పడవని చీనాచెట్లు పెట్టకుంటే ప్రతిసారీ మంచి టైములో ఇట్లయితాంది. యా పంట పెట్టినా రైతుకు ఎదురుదెబ్బలేనప్పా" అంటూ నారపరెడ్డి ఇంటివైపు నడిచాడు.

సుబ్బిరెడ్డి బండి కట్టుకొని తోట దగ్గరికెళ్ళాడు. నేల మెత్తగ నానింది. గొర్లమందే తోలించిన పట్టెలో కంపాగ్రట్టా యేరిపారేసి మడక కట్టి కోంద్ర వేశాడు. పెద్ద మడకతో నేలను మెత్తగ దున్నుతున్నాడు. కర్రు కింద రకరకాల పురుగులు పడి చచ్చిపోతున్నాయి. పలు రకాల ఆలోచనలు వచ్చి పోతున్నాయి. గుండె బరువు కాసాగింది. అనుకున్నదంతా తారుమారయింది.

పది దినాలు గడిచాయి. కొత్తపల్లి చుట్టుపక్క పల్లెల్లో ఎవరూ విత్తనం వెయ్యలేదు. సంవత్సరంలో ఇదే మొదటి వాన కావడంతో అందరూ సేద్యాలు చేసి పెట్టుకొని మళ్ళీ వాన కోసం ఎదురు చూస్తున్నారు.

నారపరెడ్డీ సుబ్బిరెడ్డీ తోటంతా తిరిగి చూశారు. ఒక రకంగా చెట్లు ఇగురొచ్చాయి. కానీ పూత రాలేదు. మునెప్ప చెప్పినట్లు ఎడగారు పంట తప్పిపోయినట్లే. మూన్నెల్ల నుంచీ ప్రాణాలన్నీ దానిమీదే పెట్టుకొని పడిన కష్టమంతా ఏట్లో వేసినట్లయింది. ఇదిగో పంట తగులుకుంటుంది, అదిగో పంట తగులుకుంటుందని ఎండమావుల వెంట నీళ్ళ కోసం వెంట పడినట్లయింది.

ఎకరా చేన్లో వేరుశెనగ వేశారు. ఇప్పుడు చీనాచెట్లకు నీళ్ళు అంతగా అవసరం లేదని పది రోజులకు వొకసారి తడి పెడుతున్నారు. వానకు తడిసి ఎరువు బలంతో చెట్లల్లో ఇగుర్లు కొనలు సాగుతూ వచ్చాయి.

చూస్తూ వుండగానే కొత్త ఆకులన్నీ బలిసి నల్లబడ్డాయి. చెట్లు బ్రహ్మాండంగా విచ్చుకున్నాయి. వూరకనే చెట్లను చూసి సంతోషపడవలసిందే కానీ పంటేమో తగులుకోలేదు. 'చూసేకి వుండాడమ్మా కోస నాబట్ట' అన్న వ్యవహారమైంది.

గొర్లమంద సత్తువతో వేరుశెనగ మొక్కలు కలకలగా వస్తున్నాయి. చెన్నమ్మా లక్ష్మిదేవీ 'కురిసికలు తీసుకొని రోజుకింత వేరుశెనగలో కలుపు తీశారు. శెనక్కాయ చెట్లను చూస్తూ లక్షణంగా తోటంతా అదే వేసుకొని వుంటే ప్రాణానికి హాయిగా వుండేదని ఆరాటపడ్డారు.

అస్లేరు కార్తొచ్చింది. మళ్ళీ వానొంగలేదు. అప్పుడేదో ఆరెద్దల కార్తిలో వెక్కిరించినట్లు వొచ్చి పొయ్యింది గానీ, తీరా రైతులంతా సేద్యాలు చేసుకుని విత్తనాలు రెడీ చేసుకునే సరికి వాన పూర్తిగా 'మొఃగపెట్టింది.' ఇటు బతకనీకుండా అటు చావనీకుండా చంపుకు తింటూవుండే వానలు ఈ గడ్డ మీద రైతుల బతుకులతో ఆడుకుంటున్నాయి.

'వోదు గాలికి పెట్టుకుంది.' పల్లెలన్నీ వూగిపోతున్నాయి. ధొడ్లల్లో గడ్డి పోచలు లేవు. ఇళ్లల్లో తిండి గింజలు లేవు. పొలాల్లో పనిపాటలు లేవు. పెద్దోల్లకు డొక్కల కరువు జ్ఞాపకమొస్తూవుంది. గతంలోని గంజి



* నవంబర్, డిసెంబర్ నెలల్లో చీనా చెట్లు (బత్తాయి) వాడిపోతే తడివేస్తారు. అప్పుడు కొత్త చిగురు వేసి పూతపూసి పిందెలు పుడతాయి. ఆగస్టులో ఆ పిందెలు పండి కోత కొస్తాయి. దాన్ని సీజన్ పంట అంటారు.

కేంద్రాలు కనిపిస్తున్నాయి. వూర్లొదలి పోదామనుకుంటే ఎక్కడ పోవల్లో దిక్కుతోచడం లేదు. ఎక్కడ చూసినా బోసిపోయిన పొలాలూ, దిగంబరంగా వున్న గుట్ట లూను. ఒకటి రెండు చోట్ల వరినార్లూ, అక్కడక్కడ చీనా చెట్లూ తప్ప భూమంతా చివికేసిన దానిమాదిరి కనిపిస్తూ వుంది. దూరంగా తుంగభద్ర కాలువ కింద వేరుశెనగ పైరు పచ్చ పచ్చగ కనిపిస్తూ వుంది.

'ఆ కాలవ కిందుండే పల్లెలోల్లు ఈ కాలానికి వున్నా త్తుమలప్పా. సమ్మత్సరానికి ఒక పంటన్నా పండుతాది. ఎవురో ఆ కాలంలో మాన్నుబావులు వున్నెం కట్టుకొని వొగమంచిపని చేసిపోయినారు. అంతమాత్రం నీటి ఆ దరువు వుంటే యెట్లోగట్ల బతకచ్చు. ఆ పక్క ఎక్కడో ఎప్పుడూ వరదలొచ్చి వూర్లూర్లు కొట్టక పోతాండా యంట. ఆ నీల్లన్నీ కాలవల గుండా ఈ పక్కకు మల్లిస్తే ఈ గడ్డంతా సుబిచ్చంగా వుండదేమప్పా?'

'దేసెమంతా అట్ల సుబిచ్చమయితే మల్లా వాళ్ల దెగ్గిరికి పొయ్యేది యెవురన్నా' మనము ఇట్లనే వుండల్ల, వాళ్లు ఇదిగో బొమ్మ అదిగో బొమ్మ అని ఆరిసే తిలో సొర్గం చూపుతానే వుండల్ల, మనం వాళ్లెంట పడతానే వుండల్ల, వాళ్లు రాజ్జెం ఏలుతానే వుండల్ల.'

పీర్ల చావిడి దగ్గర అరుగు మీద కూర్చొని ఎవరికి తోచినట్ల వాళ్లు మాట్లాడుతున్నారు.

* * * * *

వరి నార వచ్చింది. ఇంక 'శాడకు' వేసుకొని త్వరగా మడి అదును చేసుకుంటే ఆ రెండు నార పోచలూ నాటుకోవచ్చు. కూలి మనుషుల్ని పిలుచు కోవడం కంటె దినానికి నాలుగు కయ్యలు మడి అదును చేసుకుంటే ఖర్చు తగ్గుతుందనుకున్నాడు నారపరెడ్డి. నారకయ్యలో తీరుబండకింద గుమ్మడి వేస్తూ ఆకాశం పక్క చూస్తూ మాలవున్నము పొయ్యే దాకా వర్షం రాదనుకున్నాడు. త్వరగా మడి నాటు కొని చీనా చెట్లల్లో మళ్లీ పాదులు చేస్తే గాలికి ఆరి ఒక నెలలోగా చెట్లు వాడు పట్టుతాయని కొడుక్కు చెప్పాడు.

చెట్లల్లో పనిచేస్తూ సుబ్బిరెడ్డి, తమ్ముడికి శెలవులన్నా వచ్చి వుంటే బాగుండేదనుకున్నాడు. తలాకొక పని చేస్తే కూలోల్ల బెడద తప్పిపోయేదని అనుకున్నాడు. ఆమాటే తండితో అన్నాడు. అదే అదుననుకొని నార పరెడ్డి కొండారెడ్డిని చదువు విడిపిస్తే మేలన్నాడు. ఆ చదువుల వల్ల ప్రయోజనం లేదని, నెలకు బస్సు ఛార్జీలు అరవై రూపాయలు దండగని అన్నాడు. చదివినంత మాత్రాన ఉద్యోగాలు నమ్మకం లేదని, ఇటు సేద్యం పనీ రాకుండా పోతుందని మాన్పించడమే మేలన్నాడు.

"మద్దెలో చదువు మానిపిస్తే యెట్లనాయనా? నాకంటే సదువు రాకపాయ. సదువుకుండే వాన్నయినా కాలేజీ సదువు అయిపోయేదంకా చదివిస్తే మేలుగదా! వాడు వాల్ల క్లాసులో అందరికంటే ఫస్టు వస్తాండాడంట మొన్న ఇంటర్‌మీడెట్లో మంచి మార్కులు తెచ్చుకు న్నందుకు ఇంతలో వెయి రూపాయలు బహుమానం కూడా ఇస్తారంట. అట్లాటోన్ని సదువు మానిపిస్తే యెట్ల? ఇంగ రొండేండ్లు కష్టపడితే అదేందో బీయస్సా గీయస్సా అయిపోతుందంట. అదొక్కటీ అయిపోతే యెవుర్నో వొకర్ని పట్టుకొని వొక సన్న వుద్యోగంలో చేరిపిస్తే ఆయిగా వాడే బతుక్కుంటాడు" అంటూ సుబ్బిరెడ్డి చెట్టుకింద నుంచీ బయటికొచ్చాడు.

"ఈ కాలంలో మనట్లా వాల్లకు యావుద్యోగాలు వొస్తాయప్పా? తినేకి తిండి లేకపోయినా కాపొల్లం అయిపోతిమి. అదేందో పెద్ద కులాలోల్లంతా వొక పక్కా, సన్నకులాలోల్లంతా మరోపక్కా చేరి గలాటలూ ట్రైకులూ చేస్తాండారంట. లేని ఉద్యోగాల కోసం ఈల్లంతా యాల కొట్లాడుకోవల్లప్పా? సన్న కులమూ లేదు, పెద్ద కులమూ లేదు. దుడ్లుండే వాల్లకే వుద్యో గాలొచ్చేది. మన దెగ్గిర ఆ దుడ్లూ లేవు, వుద్యోగాలూ రావు. వూరకనే యాలప్పా పనికిరాని సదువులు? ఏదో లెక్కాచారం చేసేకీ, జాబు రాసేకీ సదునొస్తే సాలు" జీవితాన్నంతా చదివినట్టు మాట్లాడాడు నారపరెడ్డి.

"లేదు నాయనా, రొంత సురుగ్గా వుండి శ్రద్ధగా సదువుకుండే వాళ్లు ముందుకు పోతాంద్లాడా నీకు తెలీదు. వాన్ని సదివిస్తే తప్పకుండా గవర్మెంటు వుద్యో గంలో చేరుకుంటాడు. ముందుకూ పొయ్యే వాన్ని తీసకొచ్చి ఈ సేద్యంలో యేస్తే దీంట్లో ఏముంది? ఈపొద్దు మూరెకరాల సేను వుండేవానికంటే, పదెక రాల తోట వుండేవానికంటే కలెక్టరాపీసుల పనిచేసే వొక జవాను సుకంగా బతుకుతాండాడు నాయనా" అంటూ సుబ్బిరెడ్డి గడ్డిమోపు నెత్తిమీదికి ఎత్తుకొని, మోచేతికి పార తగిలించుకున్నాడు. ఇద్దరూ ఇంటికి యెల్లవారినారు.

చుట్టుపక్క తోటల వాళ్ళు వొకరిద్దరు వాడుకకు తగ్గట్టు తలాకొక ఎకరా, అర్దెకరా వరి నాటుకుంటు న్నారు. వీళ్ళ పొలంలోకి వాళ్ళూ, వాళ్ళ పొలంలోకి వీళ్ళూ పరస్పరం బదులు చేసుకుని వరి నాటుకుం టున్నారు. చెన్నమ్మా లక్ష్మీదేవీ పక్క తోటల వాళ్ళకు బదులు పోయి సుమారుగ పది కూళ్లు చేశారు. ఎవరూ 'పంచేటు' చెయ్యకుండా అందరూ వొస్తే తమ మడి కయ్యలు నాటుకోవచ్చునని అందర్నీ మర్నాడు తమ మడి నాటడానికి రమ్మని పిలిచింది చెన్నమ్మ.

బురద మడిలో 'పిట్టక' వేస్తున్నారు. నారపరెడ్డి మడక తోలుతున్నాడు కొండారెడ్డి పెల్ల తొక్కుతు న్నాడు. సుబ్బిరెడ్డి పారతో తగ్గులు మిట్టలు సమానం చేసి మూలలన్నీ తిరిగేసి బురదతో గెనుములన్నీ పెట్టి 'పొకుమాను' తోలి చదును చేస్తున్నాడు. మడి అద్దం మాదిరి కనిపిస్తూ వుంది.

చెన్నమ్మా, లక్ష్మీదేవి బువ్వగంప ఎత్తుకొని వొచ్చి నారు. అందరూ ముఖాలు కడుక్కొని కాలవ పొర దగ్గర కూర్చున్నారు. చెన్నమ్మ తలాకొక రాగిముద్ద చేతికందించింది. లక్ష్మీదేవి వేరుశెనక్కాయల 'వూరుమిండి' ముద్దగుంతలో వేసింది. నారపరెడ్డి పిడి కిలి వెండా ముద్ద తీసుకొని కళ్ళకద్దుకొని దూరంగా విసిరేశాడు. దానికి కాకులు చుట్టుకున్నాయి. ఇంకా కూలోళ్ళు రాలేదని యెదురు చూస్తూ ముద్దతింటు న్నాడు సుబ్బిరెడ్డి. వూరిమిండిలో కారం ఎక్కువ యిందని 'వుసుళ్లు' కొడుతున్నాడు కొండారెడ్డి.


'అంతకారం యాడుందప్పా, అట్ల వుసుల్లు కొడ తాండావు', అంటూ ఇత్తడి పళ్ళెమిచ్చి మజ్జిగ పోసింది చెన్నమ్మ. కొండారెడ్డి పళ్ళెం నిండే మజ్జిగలో ముద్ద కలిపి మధ్య మధ్యలో వుల్లిగడ్డ కొరుక్కుంటూ తింటున్నాడు.

కూలివాళ్ళొచ్చారు. నార తెగపీకకుండా చూడండని వాళ్ళకు జాగ్రత్తలు చెప్పి చెన్నమ్మ మొదటి 'మునం'లో వొంగింది. ఊదర కర్రలు తప్పించండని చెప్పింది. అన్నా చెల్లెలూ మడికయ్యల్లోకి నార తీసుకుపోతున్నారు. కొండారెడ్డి నారకట్టలన్నీ మునాల వారీగా నాటడానికి వేస్తున్నాడు.

* * * * *

ఉత్తరకార్తె వొస్తూవుంది. వానొంగ లేదు. సుమా రుగ రెండున్నర నెలలు కావచ్చింది. మళ్లీ చినుకులు పడక. 'ఉత్తర జూసి యెత్తర గంప' అని అంటారు. పరిస్థితి చూస్తే అట్లాగే వుంది. సరిగా ఎండ కాయడం లేదు. అంతా కు ళ్ళమాడానికి తిరుక్కుంది. పగలూ రాత్రీ వొకటే వోదుగాలి. జనమంతా అల్లాడి ఆకులు మేస్తున్నారు. ప్రతి పల్లె దగ్గరా గాడిదలు వూరేగించారు. కప్పలకు పెళ్ళిజేశారు. పాత సామాన్లన్నీ మోసుకొని పోయి వూరి పొలిమేరల్లో వేసి వచ్చారు. కొత్తపల్లిలో ఆంజనేయస్వామికి ఆకుపూజ చేయించారు. విరాట పర్వం చదివించారు. వానేమో వొంగలేదు.

కాలం చాలా గడ్డుగా నడుస్తూవుంది. ఎక్కడా బీదా బిక్కికి అప్పులు పుట్టడం లేదు. పనికి పోదా



కిన వేలితో మీట్తూ గిత్తలను అదిలిస్తున్నాడు. బండిలో ఎనిమిది ఎరువుల మూటల బరువుంది. బేరింగులు దెబ్బ తిన్నాయేమో, బండి బరువుగా దొర్లుతూ వుంది. కుడిపక్క టైర్లో గాలి కూడా తక్కువ వున్నట్లుంది. అట్లుంటే గిత్తలు బరువుపడతాయని, త్వరగా నలిగిపోతాయని చెప్పాడు నారపరెడ్డి. ఆ పిల్లవాడు సంజాయిషి లాగ ఏదో చెప్పాడు. బండి మెల్లగా పోతూవుంది. నారపరెడ్డి చూపులు మాత్రం రోడ్డు మీదున్నాయి. మనసెక్కడెక్కడో చూస్తూ వుంది.

".... విన్న నడిపోనికి కాలేజీలో బహుమానంగా ఇచ్చిన వెయ్యి రూపాయల్లో అప్పడే డెబ్బయి అయిపాయ. వాడేమో పాపం సైకిలు తీసుకోవల్లని ఆశగా వుండాడు. వాన్ని యెట్లన్నా గానీ వొప్పించల్ల. లక్ష్మిదేవి గొలుసు కొనుక్కోవల్లని పాలదుడ్లు అయిదు నూర్లు జమ చేసిందని వాళ్ళమ్మ చెప్పింది. అంతా కలిపితే పద్నాలుగు నూర్లు అయితుంది. సబ్సిడీ ఇచ్చే ఆఫీసరుకు వొక యాభై పోయినా, మిగిలిన దానికి ఏడు మూటల ఎరువు తెచ్చుకోవచ్చు. పంట బాగయితే అయిదు నూర్లు కాకుంటే ఆరు నూర్లేసి ఆయమ్మకు గొలుసులు తీసివ్వవచ్చు–" ఆలోచిస్తూ లారీ హారన్ విని తల పైకెత్తి చూశాడు నారపరెడ్డి. కొత్తపల్లి వచ్చింది. బండి దిగి ఇల్లు చేరుకున్నాడు.

* * *

టవున్లో తార్రోడ్డుమీద నడుస్తున్నాడు నారపరెడ్డి. కాళ్ళు కాలిపోతున్నాయి. గౌరీ టాకీసు పక్క పోయే రోడ్డువైపు చూశాడు. సుమారు నూరుమంది కూలీలు పైనుంచీ కింది దాకా వరసగా నిలబడి సిమెంటు కలిపిన కాంక్రీటు గంపలు అందుకుంటూ కేకలు వేస్తున్నారు. కింది పక్క పెద్ద మిషను, సిమెంటూ కంకరా ఇసుకా కలిపి మాటిమాటికీ కింద గుమ్మరిస్తూ వుంది. నారపరెడ్డి అట్లే నిలబడి పైకి చూస్తున్నాడు.

"వానెమ్మ కడుపుగాలా, ఎవుడో యెంతపెద్ద బిల్డింగు కట్టిస్తాండాడప్పా! మూనెల్ల కిందట వొచ్చినప్పుడు ఈడ యేందీ లేకపాయ. అప్పడే మూడంతస్తులు పైకి లేసినాయి. అబ్బబ్బబ్బా! నెల్లోగూడా వొగ అంతస్తు కట్టిన్నారు గదప్పా. సుమార్గ నలభై యాభై లచ్చలు అయింట్లుందేమో! అంతంత లెక్క యాట్నుంచి తెస్తాడో?" అనుకుంటూ నడుస్తున్నారు నారపరెడ్డి.

బజారంతా చాలా రద్దీగా వుంది. జనాన్ని తప్పించుకుంటూ ముందుకు పోతున్నాడు నారపరెడ్డి.

'ఇంత ఎండ వున్నా యాడ జూసినా జనమే. ఏం పనుంటుందో యేమో! అంతా పల్లెటూరోల్లే. యా వోటల్‌కాడ చూసినా, యా సాపులకాడ చూసినా, యా సోడా అంగల్ల దగ్గర జూసినా అంతావాల్లే. పనీపాటా యిడిసిపెట్టి ఇట్ల టవునుకు తిరగ మరిగితే ఇంగ పని చేసేడెవుడు? టవునుకు వొచ్చి పోవల్లంటే వూరకనే అయితుందా? ఎన్ని దుడ్లు కావల్ల! ఈ జల్సాలకు అంతా ఈల్లకు దుడ్లు యాట్నుంచి వస్తాయో! అనంతవురమే యిట్లుంటే ఇంగ మదరాసూ, బొంబాయీ, కలకత్తా, డిల్లీ – అవెట్లుంటాయో! సీమల్లపుట్టలు పగిలినట్లు యేమి జగమబ్బా! దీండ్లదుంపతెగా,' మోటరు సైకిల్లూ, ఇస్కూటర్లూ కార్లూ జీరంగులు పోయినట్లే. ఇవన్నీ యాటికి పోతాండాయో! ... సినిమా ఆలు దెగ్గిర ఏమి జనమప్పా! ఎర్రటెండలో టిక్కెట్లకోసం ఆ సావు సాయకుంటే యేమి? కొంత రస్సు తగ్గినంక సూడగూడదా? అన్నీ, దుడ్లు ఎక్కువయిన చేష్టలు. దేసెమూ పేద దేసమంటారు? ఈ టవున్లల్లో పేదరికం యాడ కనిపిస్తుందప్పా?' అనుకుంటూ అగ్రికల్చర్ ఆఫీసుకు చేరుకున్నాడు నారపరెడ్డి.

"యమార్నోతో రాయించుకొని తెచ్చినావు. బాగానేవుంది. వరాలే రాకుంటే ఎరువులు తీసుకొని పోయి యాడేస్తవయ్యా? ఇంతకూ ఇప్పడు సబ్సిడీ కింద ఎరువులు ఇస్తున్నామని నీతో ఎవరు చెప్పినారు? సబ్సిడీ నిలిపేసి అప్పడే నెలరోజులయిందే" అని గుమాస్తా మర్యాదగనే మాట్లాడాడు.

ఎదురుగా బెంచీమీద కూచ్చోని, పుస్తకంలోని కాగితాలను తిరిగేస్తున్న గుమాస్తా ముఖంవైపే వినయంగా చూస్తున్నాడు నారపరెడ్డి.

'చీనాచెట్ల కని చెప్తితే యవారం అడ్డం తిరిగేటట్లుంది. చెప్పకుండా వుంటేనే మేలు. వానలు రాకపోయినా తోటా దొడ్డీ వుండేవాళ్లు బావి నీళ్లతో పైర్లు పెట్టుకుంటారని వీళ్లకు తెలీదేమో! మనసులో అనుకుంటూ చూస్తున్నాడు నారపరెడ్డి. గుమాస్తాయేమో తలపైకెత్తనే లేదు. చాలా శ్రద్ధగా పనిచేసేవాని మాదిరి రాసుకుంటున్నాడు.

"తోట్లో బాయి నీళ్లకు కొంత శెనిక్కాయ యేసుకొని, వొరినార పోసుకుండాము సార్, మా వూరోల్లకు శానామందికి సబ్సిడి ఎరువులు మీ ఆఫీసులో ఇచ్చినారంట. అందికే వొస్తిని సార్" చేతులు పిసుక్కుంటూ చెప్పాడు నారపరెడ్డి.

"ఇచ్చి నామప్పా. ఇవ్వలేదని నేను అనడం లేదే! పాత స్టాకు వున్నంత దాకా ఇచ్చినాము" అంటూ గుమాస్తా పైకి లేచి బయటికి నడిచాడు. నారపరెడ్డి వెంటబడ్డాడు.

గుమాస్తా ఆఫీసు వెనక్కివెళ్ళి వొంటికి పోసి వచ్చాడు. నారపరెడ్డి చింతచెట్టు కింద నిలబడి చింత చేస్తున్నాడు. గుమాస్తా సిగరెట్టు పెట్టె బయటికి తీశాడు.

**డిజార్డర్..**

**ప్రేయసీ ప్రియులిద్దరూ రెస్టారెంట్‌లో కూర్చున్నారు.**

**"డార్లింగ్! ఈ రోజు మనిద్దరి కోసం నువే ఆర్డర్ చెయ్యాలి" అన్నాడు ప్రియుడు.**

**"ఓ... తప్పకుండ! నా కోసం కాఫీ, నీ కోసం అంబులెన్స్ ఆర్డర్ ఇవ్వనా? అంది ప్రియురాలు.**

**ప్రియుడు కంగారుగా "అంబులెన్స్‌తో నాకేం పని" అన్నాడు.**

**"వెనక్కి తిరిగి చూడు. మా డాడీ. అన్నయ్య ఇటువైపే వస్తున్నారు" అంది విదానంగా.**

**–కె.వి.ఆర్. అక్కయ్య**

"యెట్లన్నా గానీ సాయం చెయ్యండి సార్, పేదోన్ని"

"మీ రైతుల కష్టాలు వింటే సహాయం చెయ్యాలనే అనిపిస్తుందప్పా. అయితే ఆఫీసర్లతోనే వచ్చింది చిక్కంతా. వాళ్ళకు ఇవ్వ వలసింది ఇవ్వకుంటే సంతకం చెయ్యరు" అంటూ సిగరెట్టు ముట్టించుకున్నాడు గుమాస్తా.

'వొరి నీయమ్మా, ఏమి నాటకాలు ఆడుతాన్రా' అని మనసులో అనుకొని యాభై రూపాయల నోటు ఒకటి తీసి గుమాస్తా చేతికి ఈబోయాడు.

"ఒక్కొక్క మూట మీద డెబ్బై, ఎనభై మిగులుతుందయ్యా. అయిదెకరాలకూ పదిమూటలు ఇస్తాం. నువ్వు పది మూటలు బయట కొంటే ఎంతవుతుందనుకున్నావు? జవానుకు ఇచ్చినట్లు యాభై ఏమిటయ్యా? ఎప్పడూ మేము డబ్బుల ముఖం చూడలేదనుకున్నావా" చాలా తేలిగ్గా మాట్లాడాడు గుమాస్తా. నారపరెడ్డి ఇంకొక యాభై కలిపి సూరిచ్చాడు. గుమాస్తా నోట్ల మడతలు విప్పి చూసి వాపసు ఇచ్చి, "నీ జోబీలోనే భద్రంగా వుంచుకోవయ్యా. యా వూరు నీది? ఆఫీసుకు వొచ్చే ముందు అన్నీ తెలుసుకొని రావాలన్న విషయం తెలీదా? మూటకు ముప్పై ప్రకారం ఇచ్చేటట్లయితే లోపలికి రా, లేకుంటే రావొద్దు". అంటూ చీదరించుకొని లోపలికెళ్ళిపోయాడు గుమాస్తా.

నారపరెడ్డి చెట్టుకింద దిగులుగా ఆలోచిస్తున్నాడు. మనసంతా వికలమయింది. వొళ్ళంతా జెర్రులు పారాడినట్లయింది. నారపరెడ్డి రక్తంలో ఈ గవర్నమెంటు వాళ్ళనందర్నీ నరికి పారేయాలన్నంత అక్కసు! నారపరెడ్డి నరాల్లో ఈ స్వాతంత్ర్యానికంతా అగ్గిపుల్ల గీసిపెట్టల్ల అన్నంత బాధ!! నారపరెడ్డి గొంతులో ఈ రాజ్యంమీద నెకరించి వుమిసేయాల అన్నంత కోపం!!! కానీ నారపరెడ్డి జీవితంలో ఇట్లాంటివి ఏవీ చేయలేనంత దైన్యం!

బాధనూ కోపాన్నీ 'సుదారించుకొని' మవునంగా లెక్కవేశాడు నారపరెడ్డి. "ఎనిమిది మూట్లమీద సబ్సిడీ ఇస్తే 'సాట్టాబట్టా' అయిదు నూర్లు మిగులుతుంది. ఆ అయిదు నూర్లకోసం ఇతగాల్లకు మూడు నూర్లకుపైగా లంచాలియ్యల్లా? ఛూ, దానెమ్మ ... లంచం ఈడమూ వొద్దు, ఆ సబ్సిడీ ఎరువూ వొద్దు! 'కులము చెడినా సుకము దక్కల్లంట!' ఇంగ ఇన్నూరు కోసం యాల దేవురించల్ల? ... వూరకనే, అగనాగ్గా డెబ్బై రూపాయలు ఆ నాయాల్ల ముండమోపిస్తిని. కడాకు అంతా గాడుబట్టిన పని అయిపాయ"

నారపరెడ్డి విచారిస్తూ, కాళ్ళీడుస్తూ బస్టాండు దగ్గరికిపోయి హోటల్లో ఒక కప్పు కాఫీ తాగి బస్సెక్కాడు.

* * *

"ఏమి నారపరెడ్డీ! పోయిన పని యేమాయా? ఎగతాలి గొంతుతో అడిగాడు సత్యమయ్య.

"అంతా గాడుబట్టిన పనిలే సత్తెమయ్యా. వుద్యోగస్తులే దొంగనాకొడుకులు. వాల్లను మేపేకే ఈ

గవుర్మెంటు వుండేది.'' విసుక్కుంటూ బెంచీమీద కూర్చున్నాడు నారపరెడ్డి.

''మల్ల, ప్రజలకు సాయపడుతుందని భ్రమపడు తుండా వేమన్నా?'' పక్కనుండే రైతు గొంతు కలి పాడు. హోటలు పిల్లోడు టీ తెచ్చినాడు. అందరూ చప్పరిస్తున్నారు.

"పద్దన్నే పాపోన్ని బండిగట్టి పంపిస్తాను సత్తెమయ్యా. కాంప్లెక్సూ యూరియా అంతా కలిపి ఎనిమిది మూటలు ఎత్తి పంపిచ్చు. అంట్లే జింకు సల్ఫేటు వొగ మూడు ప్యాకెట్లూ, నీళ్ల మందు రొండు లీటర్లూ మంచిది చూసి పంపిచ్చు. శెని క్యాయ పీకుతానే సగము లెక్క ఇస్తాను. తతిమ్మాది చీనాకాయల పంట వొచ్చినంక సుప్తా చేస్తాను." విమ్మలంగా అడిగాడు నారపరెడ్డి.

"అయ్యో, స్టాకంతా మధ్యాహ్నానికే అయిపాయ గదప్పా! రేపే కావల్లంటే యెట్లయితాది? వొచ్చే వారంలో రా. కాబట్టినంత యేసుకొని పోదువు". లెక్కల బుక్కులో ఖాతా చూస్తూ తాపీగా అన్నాడు సత్యమయ్య. ఆ గొంతులో ఉదయం లేని కొత్త శబ్దాన్ని గమనించాడు నారపరెడ్డి.

"అదేమీ సత్తెమయ్యా, పద్దన వొచ్చినప్పుడు యేసు కొని పొమ్మంటివి! అప్పుడే సరుకంతా అయిపాయ నేమయ్యా?" గట్టిగా అడిగాడు.

"అవునప్పా, ప్రొద్దున్నే వొచ్చినప్పుడు సరుకుండె కాబట్టి యేసుకొని పొమ్మంటిని. మరి అప్పుడే యేసు కొని పోగూడదా? నేను వొద్దంటానా? వున్నట్లుండి మూర్తాడు రైతులు పదీ పద్దైదు మంది వొచ్చిరి. తలా పది మూటలు తీసుకుంద్రి. ఇంగ ఎంతని స్టాకు పెట్టుకుండేకి అయితుందప్పా? రైతులు నగదన్నా ఇస్తావుంటే వెంటనే క్యాష్ కట్టి లోడు ఎత్తుకొని రావచ్చు" .

ఏమి మాట్లాడాలో నారపరెడ్డికి దిక్కుతోచలేదు. వారం దినాల వరకూ ఎరువు వెయ్యకుండా తడి కట్టకుండా వుంటే చెట్లు దెబ్బతింటాయి. అదును తప్పిపోతే చేసిన ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరయితుంది. ఆ పనికిమాలిన సబ్సిడీ ఎరువులను నమ్ముకొనకుంటే బాగుండేది. పొరపాటు అయిపోయింది. రవ్వంత పొరపాటుకు సత్యమయ్య బిగుసుకున్నాడు. దీనికంతా కారణం డబ్బులేని లేకి బతుకే. పేదోని బతుకు పెద్దోని కళ్లముందు నగుబాటయిపోయింది. అయినా బతక్క తప్పదనుకు న్నాడు నారపరెడ్డి. సత్యమయ్యను ప్రాధేయపడ్డాడు. సహాయం చెయ్యమన్నాడు.

సత్యమయ్య దిగి రాలేదు. సరుకు లేదుగాక లేద న్నాడు. లోపలున్న మూటలు మర్తాడు వాళ్లు తీసి పెట్టినవన్నాడు. నారపరెడ్డి ముఖంలో రక్తం చుక్క లేదు. బాధపడ్డాడు. సరైన టైములో ఎరువులు వెయ్య కుంటే పంట రాదన్నాడు. బాకీలు తీర్చలేనన్నాడు. చేతులు పట్టుకొని సహాయం చెయ్యమన్నాడు.

"ఎట్ల సహాయం చెయ్యాల్లప్పా? అనంతపురానికి పోయేటప్పుడు ఒక మాటన్నా చెప్పి పోకపోతివి. తప్ప కుండా సబ్సిడీ ఎరువు తెచ్చుకుంటావేమో అనుకుంటిని. సరుకంతా అయిపోయిన తర్వాత వస్తే నేనేం చేసేది? తీరా ఆకులో అన్నం పెట్టుకొని కూర వెయ్యండని వస్తే, ఇక్కడ కూర రెడీగా వుండల్ల గదా! పాదుల్లో నీళ్లుబెట్టి యూరియాల కోసం పరుగెత్తి వొస్తే, మన ఇంట్లో ప్యాక్టరీ వుందేమప్పా అప్పటికప్పుడు తయారు చేసుకోడానికి? మీ రైతులతో వచ్చిందే ఇబ్బందే ఇది ... సరే, ఎక్కడో వొకచోట బదులన్నా తెచ్చి ఇస్తాన్లే. ఇంతగా కక్కుర్తి పడితే కాదనేందుకు అయితుందా?" సత్యమయ్య జాలి చూపాడు.




"షావుకార్లు, మీరు దయజూపకపోతే యాటికి పోవల్లప్పా మేము",

"ఏమిదయో యేమోలేగాని మరి, వొడ్డీ కత మాట్లాడనే లేదు. గవర్నమెంటు రేట్లు పెంచినంక ఎరువులు తీసుకొని రావడమే కష్టమయింది. ఇంగ రెన్నాళ్లు పోతే ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే మొత్తం సబ్సిడీనే తీసేస్తుందట. అప్పుడు యూరియా మూట నాలుగు వందలు అమ్మినా ఆశ్చర్యం లేదు. అట్లా పరిస్థితుల్లో మా వ్యాపారస్తుల బాధలు ఎట్లుం టాయో తెలుసుకోండి. మేమేదో దొంగ వ్యాపారం చేస్తున్నట్లు ఆఫీసర్లందరూ లంచాలు అడగడమే. ఈకుంటే వాళ్లతో, కొరివితో తలకాయ గోక్కున్నట్లే గదా! అందుకే ఇప్పట్నుంచీ అప్పల మీద మూడు రూపాయల వొడ్డీ యేసుకుంటాండామప్పా. మీకు ఇష్టమయితే తీసుకొనిపోండి, లేకుంటే లేదు.'' చాలా తెలివిగా వల విసిరి లోపలికెళ్ళాడు సత్యమయ్య.

మూడు రూపాయల వడ్డీ అంటూనే నారపరెడ్డికి నెమ్మలిరిగి పోయాయి. నోరు ఎండుక పోయింది. పక్కనున్న రైతులిద్దరూ వాళ్లకాలమా మన కాలమా, తప్పదన్నా అని వోదార్చారు. నారపరెడ్డి తలొంచు కొని చింతా క్రాంతుడయ్యాడు.

"పేదోన్ని పీక్క తినేదాంట్లో అందరూ వొగటే, దొంగనాకొడుకులు... ... థూ ఈనెమ్మ, రైతు బతుకంత అద్దుమాన్నం బతుకు ఇంగొకటి వుండదు. ఇన్ని గద్దలు పొంచుకొని వుంటే ఇంగ కోడిపిల్ల యాడ బతికి బయట పడుతుంది? రైతునింతగా యింసపెట్టే కటిక నాకొడుకులకు పుట్టగతులుం టాయా? .. కానీ, కానీ, ఈళ్ల పాపమూ పండే దినాలు రాకుండానే పోతాయా?''

నారపరెడ్డి ముఖం పైకెత్తి చూశాడు. సత్యమయ్య వేరే ఖాతా పుస్తకం తెచ్చి రాస్తున్నాడు. పాత బాకీ బాపతు ఆరునూర్లూ, ఇప్పుడు బాకీ రెండు వేలూ అంతా వొకచోట రాసి బొటనవేలి వొప్పితం వేయించుకున్నాడు.

నారపరెడ్డి కొత్తపల్లికి బయలుదేరాడు. పొద్దు పడమటింట్లో దాక్కుంది. దాన్ని వెతకడానికి చీకటి మార్గంలో చుక్కల దీపాలు పట్టుకొని రాత్రి తిరుగుతూ వుంది.

* * *

ఉత్తరకార్తె పోతూవుంది. బీదాబిక్కీ మెల్లగా పూర్లు విడుస్తున్నారు. పల్లెలన్నీ వల్లకాడు మాదిరి కనిపిస్తున్నాయి. డొక్కలు వేలాడేసుకొని పశువులు కళ్లల్లో ప్రాణాలు నిలుపుకొని దీనంగా చూస్తున్నాయి. సాయంకాలం కాగానే చింతచెట్ల మీదికి వొచ్చి గుడ్లగూబలు అరుస్తున్నాయి. వూరంతా తీసు కుంటే కొత్తపల్లిలో పది ఇళ్లల్లో కూడా దీపాలు వెలగడం లేదు. మంగలివాళ్ళ గేరిలో, పాముల వాళ్ళ వీధిలో, మాదిగోళ్ల సందుల్లో రాత్రిపూట్ల ఇళ్లు ఉన్నట్లే కనిపించవు. మగపిల్లల కోలాటాలూ, ఆడపిల్లల 'పిస్తీపీలూ' అన్నీ తగ్గిపోయాయి. మసక చీకటి పడుతూనే మట్టిగిద్దెల్లో చమురిపోసి దీపం చూపించి ఆరిపేస్తున్నారు. సీసాల్లో 'గబ్బు నూనె' పోసి మూతలకు బొక్కలు పొడిచి బట్ట పేలికలు వొత్తులుగా ఎక్కించి అగ్గిపుల్లగీసి వెలిగించి గబగబా రెండు మెతుకులు నోట్లో వేసుకొని దీపాలు ఆరు పుతున్నారు.

హస్తకార్తె వచ్చింది. రెండో దినం వానొంగింది. మూడు నెలల తర్వాత మళ్ళీ నేలంతా తడిసి మట్టి వాసనలు మనసుకు ఎంతో వూరట కలిగించాయి. వరుసగా నాలుగు రాత్రులు వురుములతో మెరు పులతో వానతల్లి నేల తాపం తీర్చింది. వంకలు దొర్లాయి. చెరువులూ కుంటలూ సగం సగం నిండాయి. బావుల్లో కొద్దిగా నీళ్ళు ఉబికాయి.

జనంలో కదలికలు కనిపిస్తున్నాయి. సంతోషమూ దుఃఖమూ లేని నడకలు నడుస్తున్నారు. ఎలి పొలాల్లో ఏ విత్తనం వెయ్యాలో దిక్కుతోచడం లేదు. 'సాయి' పొయ్యింది. శెనక్కాయ వేసుకో డానికి వీలులేదు. ముంగారి గింజలు వేస్తే పండవు. తెల్లజొన్నో, ధనియాలో, కుసుములో వేసుకోడానికి రేగడి నేల కాదు. ఎర్రనేలల్లో పద్దైదు దినాలకంతా తేమ ఆరిపోతుంది. 'ఉలవ' వేసుకుంటే తిండి గింజలకు కష్టమవుతుంది. భగవంతుని మీది భారమేసి కొంతమంది చెరువుల కింద వరినార్లు పోశారు.

నారపరెడ్డి తోటలో చీనా చెట్లు బ్రహ్మాండంగా పూతలొచ్చాయి. తోటంతా పూల వాసనతో ఘుమా లిస్తూ వుంది. చెట్లు వచ్చే తీరు చూసి సుబ్బి రెడ్డి పొంగిపోయాడు. చెట్టు చెట్టునూ ప్రాణంతో సమానంగా చూసుకున్నాడు. చెట్ల మొదుళ్ల దగ్గర పిల్లపాదులు చేశాడు. పూతలనూ పిందెలనూ ప్రతి దినమూ చూస్తూ ఎక్కడ నుసిపురుగు కనిపించినా మందులు కొట్టాడు.

చిత్తకార్తె వెళ్ళిపోయింది. మరీ వాన ఎగపెట్టింది. ఋతువులన్నీ పోయాయి. ఇంక వానొచ్చే నమ్మకం లేదు. తుఫాను తగులుకుంటే చెప్పలేము.

సుబ్బిరెడ్డి చీనాచెట్లకు నీళ్ళు పెడుతున్నాడు. చెట్లల్లో గోళీ గుండ్లంత పిందెలు ఏర్పడినాయి. చెట్లనిండా పిందెలే. ఒకొక్క చెట్లో వెయ్యో రెండు వేల దాకా వున్నాయి. అవన్నీ పెద్దగయితే కొమ్మలు తట్టుకోలేవు. పిందెపిందెనూ తాకి సుబ్బిరెడ్డి తియ్యని కలలు కంటూ చెట్లకు నీళ్ళు కడుతున్నాడు.

కాలవ పార్ర వెంట నీళ్లు రావడం లేదు. ఎడ గాలవ పడింది. మిషన్ రూములో యేదో కొత్త శబ్దం వస్తావుంది. సుబ్బిరెడ్డి పారకింద పడేసి పరువెత్తాడు. మోటార్లో నుంచీ పొగలొస్తున్నాయి. వెంటనే ఎర్రబటన్ వొత్తినాడు. పొగలు తగ్గాయి. ఇంక కొంతసేపు వుంటే అన్యాలంగ మోటరు కాలి పోయి వుండేది! 'కరెంటులో మిస్టేకు వుంటే స్టార్టరు పడిపోవల్ల, మంచి స్టార్టరు లేకుంటే ఇట్లనే అయ్యేది' అనుకుంటూ బయటికొచ్చాడు సుబ్బిరెడ్డి.

ఎదురుగా తోట అవతల పక్క కరెంటు 'డీపీ'లో మంటలు వొస్తున్నాయి. కన్నుమూసి కన్ను తెరిచే లోపల 'డీపీ' దగ్గర పెద్ద శబ్దమయ్యింది. సుబ్బిరెడ్డి గబగబా పరువెత్తాడు. పొగలు కమ్ముకున్నాయి. చుట్టుపక్కల తోటల వాళ్ళంతా చుట్టుకున్నారు. డీపీ కాలిపోయినట్లుంది. అందరి ముఖాలూ ఆందోళన చెందాయి.

'ఎట్ల చెయ్యల్లబ్బా! తీరా మంచి టైములో కరెంటు పాయనే, ఎన్నాళ్లు పడుతుందో రిపేరీ చేసేకి? ముందే ఆ కరెంటు వాళ్లు ఆంబోతు మనుషులు. ఎంత చెపినా వాళ్లకు దున్నపోతు మీద వాన కురిసినట్లే.' అనుకుంటూ పక్క తోటల వాళ్లు దస్తగిరీ, గోపాలూ, శంకరప్పా, రామిరెడ్డీ అందరూ సుబ్బిరెడ్డితోపాటు వొకచోట ఆల కూడారు. హెల్పరును పిలుచుకొని రావల్లని గార్లదిన్నెకు ఎల్లవారినారు.

హెల్పరు నడిమి పల్లికి పోయి నాలుగు 'చెయి సంచుల' నిండా శెనిక్కాయలూ కూరగాయలూ సైకిలుకు తగిలేసుకొని నిక్కుతూ నీల్గుతూ మధ్యాహ్నానికి ఇంటికొచ్చాడు. సుబ్బిరెడ్డి జతగాళ్లందరూ తమ తోటల దగ్గరుండే 'డీపీ' కాలిపోయిందని చెప్పారు. అతగానికి చీమ కుట్టినట్లు కూడా కాలేదు. 'సాలయి పొయ్యింది. రేపద్దన్నే వొచ్చి చూస్తానే' అన్నాడు. వాళ్లందరూ బంగపోయి బతిమాలారు. సైకిలు మీద పిల్సుకొని పోయి మల్లా సైకిలు మీదే వొచ్చి విడిచి పెడతామన్నారు. షోడాషాపు దగ్గరికి బలవంతంగా పిల్సుకొని పోయి సన్నారీ తాపించారు. లాస్టుకు హెల్పరు సైకిలు ఎక్కాడు.

"డీపీలో మిస్టేకుండేదీ లేనిదీ రొంపుమూడు దినాలకు వొగసారి వచ్చి గమనిచ్చేది లేదేమయ్యా? వూరకనే అన్యాయం చేస్తిరే! మా మోటర్లు కాలిపోయినాయి. ఇప్పుడు ఎవుని మీందపడి మొత్తుకుందేది?" హెల్పరును చూసి డీపీ దగ్గరు వొకరిద్దరు నోరు చేశారు. పదీ పదైదు మంది చుట్టుకున్నారు.

"నన్నేం చెయ్యమంటారయ్యా? ఈ పాత డీపీని మార్చండని ఆ ఇంజనీరుతో చెప్పి చెప్పీ సాలయి పొయ్యింది. వాళ్లు మార్చుకుంటే నేనేం చేస్తును? నా చేతుల్లో యేముంది"? హెల్పరు వినయంగా చెప్పాడు. అప్పుడు ఏం మాట్లాడినా వాళ్లు కొట్టే పరిస్థితిలో వున్నారనుకున్నాడు. వెంటనే డీపీపైకి ఎక్కి అదీ ఇదీ చూసి కిందికి దిగి కాలిపోయిందని చెప్పాడు. సింగనమలకు పోయి ఏ.ఇ. సార్‌తో చెప్పి అర్జీ రాసి ఇచ్చిరమ్మన్నాడు. తానూ గట్టిగా చెప్తానన్నాడు. అందరూ మర్నాడు ఉదయమే సింగనమలకు పోవల్లని మాట్లాడుకున్నారు.

* * *

సుబ్బిరెడ్డి పొద్దుగలగ లేచి పనులన్నీ ముగించుకొని అయిదారు మంది రైతుల్ని సింగనమలకు బయలు దేరించాడు. ఆ డీపీ కింద సుమారుగ ఇరవై తోటలు వున్నాయి. ఇరవై మంది రైతులూ బయలుదేరితే గుంభంగా వుంటుందనుకున్నాడు సుబ్బిరెడ్డి. కానీ సింగనమలకు పోయి రావల్లంటే పది రూపాయలు బస్సు చార్జీ అవుతుంది. అనంతపురం మీద పోవల్ల. జోబీలో కనిష్టమంటే ఇరవై వుండల్ల. లేకుంటే ఎల్లవారేకి వీలుగాదు. ఇద్దరు ముగ్గురు అదేమాట చెప్పినారు సుబ్బిరెడ్డితో. సుబ్బిరెడ్డికి బాధయింది,

'ఎవుడూ అనుకుండే నాతుడే లేడు. రెండు మైళ్ల దూరంలో గార్లదిన్నె వుంది. అది కూడా మండలమే. కరెంటు సబ్‌టేషన్ వుంది. ఇంత దగ్గిర్లో సబ్‌టేషను పెట్టుకొని ఈ డీపీ కిందుండే సర్వీసులన్నీ సింగనమలకు అంటగట్టినారు. ఈ పొలాలన్నీ సింగనమల మండలం కిందికి వొస్తాయంట. యాడ సింగనమల, యాడ కొత్తపల్లి? ఏమన్నా సంబందం వుందా? ప్రతి దానికీ సింగనమలకు పోవల్లంటే రైతులకు ఎంత ఇబ్బంది? రాజకీయ నాయకులు వాళ్ల వాళ్ల అనుకూలాలను బట్టి మండలాలకు పల్లెలను చేర్చుకుండారంట. ఇవన్నీ ఆఫీసర్లకు తెలీవా? దగ్గర దగ్గరుండే పల్లెలన్నీ ఒకే మండలానికి చేరిస్తే రైతులకు ఎంత అనుకూలంగా వుండేది? గవర్నమెంటు పనులన్నీ ఇంతే. మల్లా అందరూ నడువుకుండారు?' ఆలోచిస్తున్నాడు సుబ్బిరెడ్డి. బస్సు వచ్చింది. అందరూ బస్సెక్కారు.

* * *

"యావూరయ్యా? ఏం కావల్ల? శానామంది వొచ్చినారే". సబ్‌స్టేషన్లో లైనుమ్యాను అడిగాడు.

"మాది కొత్తపల్లి సార్. రైలురోడ్డు పక్క నుండే డీపీ కాలిపొయ్యింది. నిన్న పొద్దన్నుంచీ కరెంటు లేదు సార్. చీనా చెట్లు పిందెలతో వుండాయి. నీళ్లు పెట్టకుంటే రాలిపోతాయి. రొంత వచ్చి చూసి సరిచెయ్యండి సార్". సుబ్బిరెడ్డి మెత్తగా అడిగాడు.

"రైలు రోడ్డు దగ్గర డీపీ అంటే మాకెట్ల తెలుస్తుందయ్యా! ఎన్నో నంబర్ డీపీనో చెప్పండి".

"ఎన్నో నంబర్ డీపీనో మాకేమి గొత్తు సార్? నిన్న మా యెల్పరు వొచ్చి చూసినాడు. మీ దెగ్గిరికి వొచ్చి చెప్పలేదా?"

"ఎవురూ వొచ్చి చెప్పలేదే. హెల్పర్లంతా నిన్న రాత్రి నుంచే స్ట్రైకు చేస్తాండారయ్యా. పైగా ఏ.ఇ. కూడా వూర్లో లేడు. నాలుగు దినాలు లీవు పెట్టినాడు. ఆయన వొచ్చే వరకూ ఏమీ చేసేకి లేదు". చాలా తేలిగ్గా చెప్పాడు లైన్‌మ్యాన్.

ఆ మాటలు వింటూనే వాళ్ళ ముఖాల్లో నెత్తురు చుక్క లేదు. సుబ్బిరెడ్డి శరీరమంతా బాధతో కోపంతో వొణికిపోయింది. నరాలన్నీ బిగుసుకుపోయాయి. అందరూ మాటలురాని వాళ్ళయ్యారు. ఏమి చేయడానికీ దిక్కు తోచలేదు. గట్టిగా నోరు చేయడానికి ఇంజనీరన్నా లేడు. లైనుమ్యానుతో కొట్లాట పెట్టుకుంటే ఏం లాభం? కర్మగాలి ఆ ఇంజనీరూ ఇప్పుడే లీవు పెట్టినాడు. ఇట్లయితే రైతుల గతి ఏం కావల్ల? ఎట్ల చెయ్యల్లబ్బా!

దిగులు పడుతూ గొణుగుతూ ఒకరి ముఖం వొకరు చూసుకున్నారు. సుబ్బిరెడ్డి పెదువులు కొరుక్కుంటూ బరువుగా నిట్టూర్పులు వొదలసాగాడు.

"ఆయన లీవు పెడితే మీరన్నా వొచ్చి యేదో వొగటి చెయ్యొచ్చు కదా సార్! ఆయనొచ్చేదంకా వుండల్లంటే రైతులు ఏంగావల్ల?" గట్టిగా అడిగాడు గోపాలు.

"నేను ఇంజనీరును కాదయ్యా, లైన్‌మ్యాన్ని. డీపీ కాలిపోతే నేను ఏమీ చెయ్యలేను. దాన్ని మార్చల్లంటే తమాషా అనుకుండారా? పైన్నుంచీ పర్మిషన్ రావల్ల. వొగ అర్జీ రాసిచ్చిపోండి. ఏ.ఇ. సారు వస్తానే



చూపించి చెప్పతాను" సర్ది చెప్పాడు లైన్‌మ్యాన్.

కక్కలేక మింగలేక అందరూ బయటికొచ్చారు. గోపాలు అర్జీ రాశాడు. అందరూ సంతకాలు చేసి ఆఫీసులో ఇచ్చారు. చార్జీలు బోధించుకొని చెవులు జాలేసుకొని వూరు చేరుకున్నారు.

నాలుగు దినాలు వెళ్ళిపోయాయి. నారపరెడ్డీ, సుబ్బిరెడ్డీ చెట్లల్లో తిరుగుతున్నారు. తడిపెట్టక పద్దైదు దినాలయ్యింది. డీపీ కాలిపోయే నాటికి తడి పెట్టవలసి వుండేది. తీరా తడి పెట్టే సమయంలో డీపీ కాలిపోయింది. అప్పడే పిందెలు వాడుమొగం పట్టినాయి. పాపం, దాండ్లది యెంతప్రాణం! ఇంగా నాలుగు దినాల వరకూ కరెంటు రాదంటున్నారు. అక్కడక్కడ బలం లేని పిందెలు రాలిపోతున్నాయి.

నారపరెడ్డి తల మొద్దుబారి పొయ్యింది. సుబ్బిరెడ్డి పెదవులు ఎండుకపోయాయి. ఏమీ వేయలేని పిరికి తనం పండ్ల కింద నలిగిపోయింది.

సుబ్బిరెడ్డి కింది పక్కకు వొచ్చాడు. వరిమడి ఆరిపొయ్యింది. నేలంతా చిన్నగా నెటికలు పారుతూవుంది. శెనక్కాయి పైరు మాత్రం మొండిగా అట్లే ప్రాణం బిగబట్టుకొని వుంది.

"బగవంతుని పున్నాన ఈ పొద్దో రేపో వానన్నా వొస్తే మేలే" అనుకుంటూ తండ్రీ కొడుకులు ఇద్దరూ ఇంటిదావ పట్టారు. మవునం నడుసుకుంటూ పోతూ వుంది. మనసులో పట్టని దిగులు మాటిమాటికీ ముక్కుల గుండా బయటికి పొర్లుపోతూవుంది. శరీరాలు రెండూ ఆలోచనల కొలిమిలో కాగి వేడెక్కిపోయాయి. ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు.

సుబ్బిరెడ్డి మూడోసారి సింగనమలకు బయలుదేరాడు. ఈసారి పదిమంది ఎల్లవారినారు.

"ఏమయ్యా, కరెంటు ఫీజులు కట్టేవాళ్ళ మాదిరి బలే జబర్దస్తీగా మాట్లాడుతున్నారే! కొత్త డీపీలు స్టాకు లేవు, మరి నన్నేం చేయమంటారు? ఆ డీపీకి లోడు ఎక్కువయితుందయ్యా, ఇంక కొత్త సర్వీసులు ఇచ్చేది లేదంటే, ఇచ్చే వరకూ నా ప్రాణం తీస్తిరి. ఇప్పుడు కాలిపోయిందంటే ఎవరు బాధ్యులు? చేసుకున్న దానికి అనుభవించండి. కొత్త డీపీ కావల్లంటే వూరకనే అవుతుందా? ఈ గుడ్డి ప్రభుత్వం రైతులకు కరెంటు చార్జీలు చాలా తగ్గించేసింది. కరెంటు మోటరున్న ప్రతి రైతూ నెలకు కనిష్టం అంటే నూటాయాభై రూపాయలకు పైగా కరెంటు కాలుస్తాడు. అట్లాంటి మీరు ఇరవై ఆరు రూపాయలు కడతారు. డిపార్టుమెంటుకు ఎంత నష్టమనుకున్నారు? ఆదాయముంటే గదా పనులు జరిగేది? వూరకనే ఇక్కడ గలాటా చేస్తే ఏం ప్రయోజనం? వెళ్ళి ప్రభుత్వాన్ని అడగండి" ఇంజనీరు విసుక్కుంటూ చెప్పాడు. దాంతో అందరూ రెచ్చిపోయారు.

"ఇట్లనే టవున్లో కరెంటు పోతే మీరు వూరకనే వుంటారేం సార్" అంటూ గోపాలూ,

"రైతులు అదవజిక్కినోల్లని గదా సార్, మీరిట్ల చేస్తాందేది" అని దస్తగిరీ,

"లంచం ఎంతకావల్లో చెప్పండి. మా పెండ్లాళ్ని కుదవబెట్టి తెస్తాం" అని రామిరెడ్డీ,

"కుర్చీలో కుచ్చున్నంక వుద్దర జీతాలు తీసుకుంటే సరిపోతుందా" అని శంకరప్ప తలాకొక మాట ఆవేశంతో అన్నారు. ఇంజనీరు అగ్గబుగ్గయి లేశాడు.

"డోంటాక్ నాన్సెన్స్! ఫస్ట్ యూ గెటవుట్ ... ... ఎవరయ్యా అక్కడ అటెండరు వుండేది? వీళ్ళను బయటికి నూకెయ్. మర్యాద లేని గలీజు నాయాళ్ళంతా" అని గట్టిగా అరిచాడు.

"ఆఫీసు మీ తాత గంటని అనుకుండావేమయ్యా, బయటికి నూక మనడానికి? ఎవుతో నూకేది రమ్మను చూస్తాము! మర్యాద గురించి మాకు నేరిపిస్తావా నువ్వు? వారానికొగసారి ఆఫీసుకొచ్చి సల్లగా ఫ్యాన్ల కింద కుచ్చొని వుద్దర జీతాలు తినే వానివి నువ్వు మర్యాద లేనోనివి. లంచానికి గడ్డిమేసే నువ్వు గలీజు నాయాలివి" అంటూ ఉగ్రనరసింహుడయ్యాడు సుబ్బిరెడ్డి. మిగతా వాళ్ళంతా పైకిలేచారు. పీవనూ, లైన్‌మ్యానూ ఇద్దరు ముగ్గురు పరువెత్తి వచ్చి సుబ్బిరెడ్డిని బయటికి పిల్చుకుపోయారు.

"ఉద్యోగం చేసేకి చాతగాని నాకొడుకులు రాజీనామా ఇచ్చి ఇంట్లో కూచ్చోల్ల. మంది సొమ్ము తిని కండ్లు పైకెక్కినాయి ఇతగాల్లకు. రైతులంటే లెక్కా జమా లేదు. రైతులే లేకుంటే ఈయప్పగారు వుండారా? మనుషులయితే, మనసనేది వుంటే తోట్లకాటికి వొచ్చి చూస్తే తెలుస్తుంది. పైర్లు యాగతి పట్టినాయో! తినడమే తప్ప వేరే ధ్యాసే లేని కసాయి వాల్లకు ఏం తెలుస్తుంది రైతుల కడుపుమంట!" అక్కసు పట్టలేక అరుస్తున్నాడు సుబ్బిరెడ్డి.

వొచ్చేపోయే జనమంతా గుంపయినారు. పోలీసు వాళ్లు వచ్చారు. జనాన్నంతా పక్కకు పంపించారు. సుబ్బిరెడ్డివాళ్లకు సర్దిచెప్పి పంపారు. రెండు దినాల యినంక 'రైతన్నల మీద కరెంటు వాళ్ళ కన్నెర్ర' అని పత్రికల్లో వార్త వచ్చింది.

కొత్తపల్లి దగ్గరికి పెద్ద పెద్ద వాళ్ళంతా వచ్చి కాలిపోయిన డీపీని చూసి రాసుకొని పోయారు. అయితే వొక్కడు కూడా దగ్గరే వున్న తోటల పక్కా, పైరుల పక్కా కన్నెత్తయినా చూల్లేదు. రెండు దినాలయినంక కొత్త డీపీ వచ్చింది.

"ఎంతన్నాయం చేసిరప్పా తప్పుడు నాకొడుకులు? చెట్లల్లో పిందెలన్నీ నున్నగ రాలిపాయనే! సమ్మత్సరం దినాలు చేసిన కస్టమంతా నేలపాలాయనే! బగవంతుడా, రోంతన్నా దయలేకపాయనా? యెవసాయమంతా జూదమైపోతే ఇంగ యావల్లనప్పా బతికేది?" అంటూ నారపరెడ్డి తోటలో వొక చీనాచెట్టు కింద రాలిన పిందెలన్నీ కుప్పచేసి, కొక్కిరి కాళ్లమీద కూచ్చొని వెళ్లిపోతున్న పీనుగను చూసి దుమ్మెత్తి పోసినట్లు దోసిలితో పిందెల్ని తీసుకొని బాధపడుతూ కిందికి పోస్తున్నాడు.

చెట్లన్నీ బోసిపోయినాయి. ఒక చెట్లో కూడా పిందెలు లేవు. రెండు మూన్నెల్లయినా నిండక ముందే గర్భం జారిపోయి కిందబడి కన్ను మూసిన పసిగండుల మాదిరి పాదులనిండా పడిన పిందెలనూ, అబార్షనయిపోయి సొమ్మసిల్లి పడిన ఆడబతుకు మాదిరి వుండే చెట్లనూ తిరిగి తిరిగి చూశాడు సుబ్బిరెడ్డి. కళ్ళనిండా నీళ్ళు పారాయి. తండ్రి కడుపులో మండుతున్న మంటను కొడుకూ, కొడుకు కళ్ళల్లో దొర్లుతూ వున్న బడబాగ్నిని తండ్రీ వొకరికొకరు కలుపుకున్నారు. వాళ్ళ మధ్య నుండే ఎర్రని వెచ్చటి మవునం మాదిరి పడమటి దిక్కు ఎర్రబడి కాసేపటికి చీకటి ముసుగు కింద దాక్కుంది.

* * *

శవమై, 'దింపుడు కళ్ళం' వరకూ సాగిపోయి బతికివచ్చిన మనిషి మాదిరి వరిపైరు మళ్ళీ పచ్చగయింది. సరిగా కూడూ నీళ్ళూ లేక పాలిపోయి, కడుపుతో వున్న గజ్జికుక్క లాగా వరిపైరు 'వెన్ను పోయి' అర్రు వొంచింది.

చలికాలం వచ్చింది. తుఫాను లేసి ముసురు పట్టింది. అకాలంలో అరగరాని తిండి తిని వూరివెలుపల మురికి మీళ్ళగుంత దగ్గర గుడిసెల దగ్గర వాంతులు బేలుతో వుసూరు మంటున్న బిచ్చగాళ్ళ మాదిరి, పేరు తెలియని పైర్లు చావ లేక బతుకును ఈడుస్తున్నాయి. నారపరెడ్డి చేన్లో వేరుశెనగ చెట్లన్నీ కొరివి తెగులు తగిలి, ఎర్రగా వున్న మనిషి ముఖంలోని మచ్చల లాగా నల్లగా మాడుకుపోయాయి.

దీపావళి పండగొచ్చింది. నారపరెడ్డి వేరుశెనగ పీకించి వొదికి వేయించాడు. తుఫాను ముసురుకు

## చమత్కారికలు

మీరు
కొత్త దంపతులా!
అయితే
కొంతకాలం
"నిరోద్యోగులు"గా ఉండవలసిందే!

*

పులి, సింహం
క్రూర జంతువులా!
అయితే
గొర్రె, మేక?...
"కూర" జంతువులు!

*

ఆర్థికంగా వెనకబడ్డావా!
అయితే
అందుకో
"హార్దిక" శుభాకాంక్షలు!

*

సరోజినీదేవి
కవయిత్రి –
అంతేకాదు "గాయ"త్రి కూడ! ...
అందుకేనేమో
ఆమె "కల – కంఠి"

– రసరాజు

తడిసి శెనగ కట్టి పేడపేడ అయింది. పశువుల మేతకు పనికిరాదు. సంవత్సరమంతా పనిచేసిన గిత్తల నోళ్లు కొట్టినట్లయింది.

నారపరెడ్డి శెనక్కాయలు విడిపించాడు. పదిమూటలయ్యాయి. ఎక్కడా వేరుశెనగ పంట లేదు. మూట అయిదు వందలకు తక్కువ అమ్మదని అన్నారు. రెండు మూటలు విత్తనానికి తీసి మిగతావి అమ్మితే నాలుగువేలు చేతికి వొస్తుందనుకున్నాడు నారపరెడ్డి.

అనంతపురం జొన్నావాళ్ళ శెనక్కాయ మిల్లులో మూటలు దింఛినాడు .నారపరెడ్డి. మిల్లు పక్కన ఆరుబయట గుట్ట మాదిరి వున్న శెనక్కాయల రాసిని చూసి ఆశ్చర్యపోయాడు.

"అబ్బబ్బబ్బ...! యాడ పండెనప్పా ఇన్ని శెనిక్కాయలు? వాన లేక యాడే గానీ శెనిక్కాయే పండలేదని అంటాంద్రే" అని నివ్వెరపోయాడు.

మిల్లు షావుకారి కొడుకు నారపరెడ్డి వేసుకుపోయిన శెనక్కాయలను చూసి పెదవులు విరిచాడు. చాలా పసిమిగా వున్నాయని, ఐదు కేజీల కాయలు తీసుకొని రిప్రెషన్ తీయాలని, యేంచి నూనె తీసి చూశాడు. ఆయిలు శాతం తక్కువ వుందన్నారు. మిల్లు షావుకారి వెంకయ్య మెత్తని పరుపుమీద దిండుకు ఆనుకొని శెనక్కాయ విత్తనాలను చేతిలో నలిపి చూస్తూ క్వింటాలు ఎనిమిది వందలు వేసుకుంటానన్నాడు. అంటే నలభై కేజీల మూట నాలుగు నూర్లని విడమరచి చెప్పాడు. నారపరెడ్డి చప్పిడి మొగం పెట్టి, వూ కొట్టాడు.

శెనక్కాయలు తూకం వేశారు. రెండు క్వింటాల్లా నలభై కేజీలు అయ్యాయి. తరగు అనీ, ధర్మం అనీ, అదనీ ఇదనీ ఇరవై కేజీలు తీసి వేశారు. కడాకు అయిదున్నర మూటని నారపరెడ్డికి అర్థమయింది. గుమాస్తా బిల్లు తయారు చేస్తున్నాడు.

"మామూలుగా మూటనిండా వేసి తూకమేస్తే నలభై కేజీల కాయలు వుంటాయి. ఆదామాసి మూడు క్వింటాల్ల ఇరవై కేజీలు కావల్ల ఇతగాళ్లు రెండు క్వింటాల్లా ఇరవై కేజీలకే దించిరే,. ఎంత మోసం నాయాల్లప్పా! ఏదో నగదు ఇస్తార్లే అనుకొని వొస్తే ఎంతన్యాయం చేసిరి బద్దునాకొడుకులు! ఈళ్ల కొంపలు కూలా, ఏమని అడిగేదప్పా ఇంగ? అక్కడెక్కడో నకసలైట్లు ఉద్దోగస్తులనూ వాళ్లనూ వీళ్లనూ ఎత్తుకొని పోతాండారంట. ఈటికి వొచ్చి ఈ దొంగనాకొడుకులను ఎత్తకపోయి నడిబజార్లో తలకాయలు నరికెయ్యగూడదా! ఈనెమ్మ, ఎంతపని చేసిరప్పా!" లోపలే ఆక్రోశంతో గొనుక్కున్నాడు.

వెంకయ్య రెండువేలా రెండువందల రూపాయలు నారపరెడ్డి చేతికిచ్చాడు. తన బతుకును చూసి యెక్కిరిస్తున్న కాగితాలను జోబీలో పెట్టుకొని దిగులుగా బయటికొచ్చాడు నారపరెడ్డి.

–ఎండకు బంకమన్నంతా నెర్రెలు చీలి నోళ్లు తెరుసుకొని వున్న చెరువులోకి వానతుంపర పడినట్లు చేతికొచ్చింది లెక్క. ఏం పనికొస్తుంది? యాడ మాయమై పోతుందో యేమో! అనుకుంటూ ముందుకెళ్ళాడు నారపరెడ్డి.

జవుళి అంగట్లో, సిలుకు జుబ్బా తొడుక్కొని తెల్లని మెత్తని పరుపుమీద కూచొని తాంబూలం నములుతూ నోట్లు ఎంచుకుంటున్నాడు నాగయ్య సెట్టి. గుమాస్తా దూరంగా కూర్చొని మీటరు దెబ్బతో బట్టలు కొలిచి కత్తెరతో క్రిరని చించి మడతలు వేస్తున్నాడు. మరో గుమాస్తా లెక్కలు రాస్తున్నాడు. అయిదారు మంది పల్లెటూరి వాళ్లు తాన్లు తాన్లు గుట్టగా పడేసిన బట్టలను పరిశీలిస్తున్నారు. నారపరెడ్డి షావుకారికి ఎదురుగా కూర్చొని నాగయ్య లెక్కపెడుతున్న నోట్లపక్క చూస్తున్నాడు.

"అసలు మాత్రమే ఇచ్చినావు నారపరెడ్డీ మల్ల వొడ్డీ యెప్పడిస్తావు?" నోట్ల కట్టె పెట్టెలో పెడుతూ అడిగాడు నాగయ్యసెట్టి.

"ఇసారి పంట వొచ్చినంక ఇస్తాన్లే నాగయ్యా"

"ప్రతిసారీ అప్పనిలిపితే యెట్లప్పా! పాత బాకీ సుప్తా చెయ్యల్ల, మరీ తీసుకొని పోవల్ల".

"అట్లనే అనుకొంటినయ్యా, కానీ శెనిక్కాయ పంట. ఇంత అద్దుమానం అయితుందనుకోలేదు".

"ఏం పంటలో యేం రైతులో నప్పా! ఒక్కరూ కరెక్టుగా ఇవ్వాల్సిన బాకీలు ఇవ్వరు. అప్పలిచ్చి వ్యాపారం చెయ్యాలంటే ఎన్నాళ్లని చేసేదప్పా!... సరే, ఇప్పడేమన్నా బట్టలు కాబడితే తీసుకొనిపో. అంతా కలిపి అసలు కింద రాసుకుంటాను ... వొరేయ్ రంగా, నారపరెడ్డికి బట్టలు ఏమేమి కావల్లో అడిగి ఈయప్పా" అని గుమాస్తాతో చెప్పాడు నాగయ్య.

నారపరెడ్డి పిల్లోల్లకు నాలుగు డ్రాయరు బట్టలూ, నాలుగు మీటర్ల లంగా గుడ్డా, నాలుగు బనియన్లూ తీసుకున్నాడు. చెన్నమ్మ సుమారయింది వొక చీర తీసుకురమ్మనీ, పెద్దకొడుకు రెండు "పట్టెల లుంగీలు" తెమ్మనీ చెప్పినారు. కాని అప్ప మల్లా మొదటికే వొస్తుంది. ఇంకొకసారి చూస్తాములే అనుకున్నాడు నారపరెడ్డి. అక్కడే బట్టల 'మలిగి' అరుగు మీదుండే టైలరు పీరాసాబును డ్రాయర్ల బట్టా, లంగా గుడ్డా ఇచ్చి త్వరగా కుట్టమని చెప్పాడు.

పీరాసాబు అదే అరుగు మీద చాలా ఏళ్లనుంచీ బట్టలు కుడుతున్నాడు. అతని కళ్లముందే ఆ అంగడి షావుకార్లు ముగ్గురు నలుగురు మారిపోయారు. పీరాసాబు మాత్రం తన కుట్టుమిషను మార్చలేదు, స్థలం మార్చలేదు, కూచుండే పెట్టె మార్చలేదు, వేషం మార్చలేదు. కాలం మారేకొద్దీ రకరకాల ప్యాషన్లు వొస్తున్నా తాను మాత్రం కుట్టే విధానంలో మార్పు చేయలేదు. బలే తోజుగా రకరకాల బోర్డు తగిలించుకొని పేరుకువచ్చిన టైలర్లంతా ఈ పొద్దు కుట్టడానికి బట్టలిస్తే పదైదు దినాలకు కానీ కుట్టియ్యరు. పైగా కూరకంటే మసాలా ఎక్కువన్నట్లు గుడ్డ ఖరీదు కంటే కుట్టుకూలి ఎక్కువ అడుగుతారు. అతగాళ్లది బలే జంబం!

పీరాసాబు అట్లాకాదు. ఇప్పడు గుడ్డలిస్తే వొక గంటలోపల కుట్టిస్తాడు. దుడ్లు లేవని దడెము ఎక్కువ తక్కువ గుడ్డ తీసుకొని పోయినా సర్దుబాటు చేసి అంగీలూ నిక్కర్లూ కుడుతాడు. అట్లా కుట్టేదాంట్లో తనతో పోటీ తగిలే మొగోడే లేడని అప్పడప్పడు బడాయి పోతుంటాడు. ఈ ప్యాషన్లన్నీ మళ్లీ తిరుక్కొని తన మోడల్ దగ్గరికి రావల్సిందేనని అంటూ వుంటాడు. ఒక్కొక్కసారి పల్లెటూరి వాళ్ళు వచ్చి 'ఏమయ్యా సాయిబూ, ఈ లుంగీకి వొగరెట్ట పొడువూ, ఇంకొగ రెట్ట కురచగా కుట్టినావే' అని ఎగతాలి చేస్తూ దండిస్తే, పీరాసాబు గడ్డమంతా అల్లాడేటట్లు నవ్వుతూ ఆ అంగీని మళ్లీ సరిచేసి పంపుతూ వుంటాడు. అతని దగ్గర కూర్చొని మాట్లాడడం అంటే పల్లెటూరి వాళ్లకు బలే సరదా. పీరాసాబు బట్టలు ఎట్ల కుట్టినా, గంటలోపల కుట్టిస్తాడనీ, కూలి ఎంత ఇస్తే అంత తీసుకుంటాడనీ

మాసభ్యులకు,ఏజంట్లకు,మిత్రులకు,శ్రేయోభిలాషులకు దీపావళిశుభాకాంక్షలు
Ph:64757,66757
చనుమోలు
చిట్‌ఫండ్స్(ప్రై)లిమిటెడ్
చనుమోలులో సభ్యత్వం.... చింతలేని భవితవ్యం....
Bomma
27-14-57, చనుమోలుకాంప్లెక్స్, రాజగోపాలాచారి రోడ్, విజయవాడ-2
TEJA

అతనంటే వాళ్లకు చాలా ఇష్టం. మర్తాడూ, తాటి చెర్లా, కొత్తపల్లి, ఆకులేడూ ఆ పల్లెల్లో వుండే చిన్నాబన్నా జనమంతా పీరాసాబు దగ్గరే కొన్ని ఏండ్లనుంచీ వాడుక అయిపోయింది.

కుట్టిన బట్టలు చుట్టుజుట్టుకొని చెయిసంచీలో పెట్టుకొని నారపరెడ్డి బజార్లోకి వచ్చాడు. ఒక డజను జామపండ్లు తీసుకొని టువ్వాల్లో మూట కట్టుకున్నాడు. పక్కనే వున్న మార్కెట్లో వుల్లిగడ్డలూ, బెండకాయలూ అవిన్ని ఇవిన్ని తీసుకొని వూరికి ఎల్లవారాడు.

* * *

వరి మడి కళ్ళం అయిపొయ్యింది. కూలోల్లకూ, ఆయిగాళ్లకూ పోనూ ఎనిమిది మూటలయ్యాయి. సుబ్బిరెడ్డి వడ్ల మూటలన్నీ బండికెత్తాడు. నారపరెడ్డి మూటల మీద కూర్చున్నాడు. సుబ్బిరెడ్డి బండి తోలుతున్నాడు.

"ఎంత ఈనం పంటాయనో! ఇట్లా పంటలు పండితే * సుంగిడి గింజలకు ఏమిచ్చేది? తినడానికి ఏం పెట్టుకుండేది! వొడ్డీలు ఎట్ల కట్టేది? కాలావతల వానలొచ్చి సక్కరమంగా నీళ్లు పారింటే ఎట్ల లేదన్నా ఇరవై మూటల అయ్యిండు! వానలకు నమ్ముకొని ఇంగ యెవసాయం చెయ్యల్లంటే సాద్దెంకాదు. అప్పడెప్పడో ఈ గడ్డలో రత్నాలు రాసులు పోసుకొని అమ్మినారట! ఏమయి పొయ్యిందో ఆకాలమంతా? ఎంతమందో ఈ గడ్డలో పుట్టి పెద్దోళ్ళ అయిరి. అవి చేస్తాం, ఇవి చేస్తాం అని తియ్య తియ్యగా చెప్పిరి. ఇంగా చెప్పతానే వుండారు. కానీ ఇంతదంకా వొగటి కాలే, వొగటి పోలే. అందరూ పబ్బం గడుపుకొని పొయ్యేవాళ్లే. రైతు బతుకును గురించి యెవుడూ నిజంగా పట్టించ్చుకుండే వాడు లేడు".

పుట్టెడు దిగులుతో బండి దిగాడు నారపరెడ్డి. రామయ్య దగ్గర తెచ్చుకున్న రెండు మూటల సుంగిడి గింజలకుగాను నాలుగు మూటల వడ్లు మోసుకొని పోయి వేసివచ్చాడు సుబ్బిరెడ్డి బాధపడుతూ.

"శెనిక్కాయ పంటజూస్తే అట్ల కొల్లబడె. ఈ పంట జూస్తే ఇట్ల అగ్గిబడె. కొంపకు నాలుగు మూటలు వడ్ల గింజలొస్తే సమ్మత్సరమంతా యెట్ల బతికేది? ఎన్నిదినాలు ఈ బండబతుకు?" చెన్నమ్మ గొనిగింది.

నారప రెడ్డికి నోట్లో మాట రాలేదు. బండిలో వుండే మిగతా నాలుగు మూటలూ మోసుకొచ్చి ఇంట్లో గోడవార పెట్టేశాడు సుబ్బిరెడ్డి. గిత్తలిడిసి నీళ్లుతాపి గాటిపాట్న కట్టేశాడు.

"చీనాచెట్లు చీనాచెట్లని అంగలాయకుంటే ఏమి? ముదనష్టపు చెట్లు పెట్టుకొని కూటి గింజలకు అంగలాసే తట్లయింది. మాకూ తోట వుందని చెప్పకుండేకి మాత్రమే వుంది. ఇట్లా తోట వుండేనేమి లేకుండే నేమి? ఇండ్లు ఆయికం పెట్టినట్లు ఈ పాద్దో రేపో దాన్ని పెట్టక తప్పతుందా? వూరికే ఆ కోమటోల్లకు వొడ్డీ కట్టేకి యాల సలిగిపోవల్ల? ఎంతకో వొగంతకూ తోటా దొడ్డీ అన్నీ అమ్మి ఇత్తగిలిసి పిల్లలను కుతాను. ఎన్నాల్లని ఇట్ల పిల్లోల్ల కడుపులు మాడిసేది?" ఇసుర్రాయి చుట్టూ వున్న రాగిపిండి చాటలోకి ఎత్తుతూ కన్నీళ్లు కారుస్తూ అంది చెన్నమ్మ.

"నువ్వు పరాయి ఇండ్లకాడ పనులు చేస్తే మేము చూసుకుంటా వూరకనే వుంటామేమమ్మా? అంత కర్మ యేం పట్టింది? ఎందుకంత బాధపడతావు? టవున్లో బతకడమంటే మాటలా? భూమిని నమ్ముకొని వుండాము. చెడిపోతామేమమ్మా? ఎవుడో వొగసారి ఆ తల్లి గడ్డకు యెయినే యేస్తాది" వయసంతా పండిన వాని మాదిరి సుబ్బిరెడ్డి తల్లిని వోదార్చాడు.

"యేస్తాదప్పా, యెందుకెయ్యదూ? యెయిబట్టే కదా ఈటికి తెల్లారిండేది! ఇదిగో పండుతాది, అదిగో పండుతాది అని ఇట్లనే కాలమంతా సెల్లిపాయ, తినేకి తిండిగింజలు రాకుంటే యెట్ల చెయ్యల్ల? ఈ యెవసాయం కొట్టుకొని ఏం పాము కుండామనీ! శెరీరంలో వుండే సత్తవంతా బూమిపాలు చేసి సందకాటికి ఇంటికొస్తే, కడుపునిండా కూడు వొండి పెట్టేకి లేకుంటే ఆడది ఎంత బాధపడుతుందో మీకేం తెలుసు? సమ్మత్సరమంతా కష్టపడితే నాలుగు మూట్లు వొడ్లగింజలు ఇంటికొస్తే ఇంగ యావల్లన పిల్లల్ని సాకేది? ... ఈ సంసారం నేను చెయిలేనప్పా!" అంటూ పొయ్యిమీదున్న 'యెసిట్లోకి' పిండి పోసింది చెన్నమ్మ.

వ్యవసాయ చదరంగంలో మాటిమాటికీ వోడిపోతున్న నారపరెడ్డి తల వొంచుకొని మవునంగా నేలచూపులు చూస్తున్నాడు. సుబ్బిరెడ్డి బతికిన శవం లాగా కదలాడుతూ గిత్తలకు గాట్లోపాట్లు పుల్లలు పోస్తున్నాడు. లక్ష్మిదేవి ఇంటిముందు లోగిట్లో ఈత పరకతో కసువు వూడుస్తూ వుంది. కొండారెడ్డి కాలేజీ నుంచి ఇంకా రాలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. చెన్నమ్మ గొనుగుడు మాత్రం వినిపిస్తూ వుంది.

* * *

చీనా చెట్లకు మళ్లీ రుతువొచ్చింది. ఎడగారూ, గెయిరంగం పంటలు తప్పిపోయిన రైతులంతా సీజన్ కాపుకోసం చెట్లను వాడుపెట్టారు. మిగతా రెండు పంటల మాదిరి కాకుండా వొకరకంగా వాడొచ్చినా సీజన్ పంట తగులుకుంటుంది. వాడుపట్టిన చెట్లకు 'సంకురాత్తిరి' లోపల నీళ్లు వేస్తే వచ్చే 'బెనకల చవితి' (వినాయకచవితి) కల్లా పంట వొస్తుంది. అప్పటికీ ఎండలు తగ్గిపోయి కాలం చల్లబడి వుంటుంది. అందువల్ల ఆ కాలంలో మామూలుగా చీనా కాయలు రేటు సరిగా వుండదు. వొక్కొక్క సారి లారీ బాడుగలు కూడా 'ఎల్లవు'.

సీజన్ కాపురాకుంటే నారపరెడ్డి చీనా చెట్లను కొట్టే యాలని అనుకున్నాడు. అందుకే చెట్లమీద అంతగా శ్రద్ధచూప లేదు. దిబ్బలో వున్న ఎరువంతా చెట్లకు తోలకుండా చేనికి తోలి మట్టసంగా ఎకరా నేలలో వేసవి శెనక్కాయ వేశాడు. కిందున్న అచ్చుకట్టులో మళ్లీ మడి నాటితే నీళ్లతో ఇబ్బంది కలుగుతుందని వరినార పోయలేదు. మడి అచ్చుకట్టులో శ్రీరామన వమికి రాగి నాటాలనుకున్నాడు.

"చెట్లు వాడు బాగొచ్చినాయి మామా, ఈసారి మన డీపీ కిందుండే తోటలు తప్ప, ఇంగెక్కడా సీజన్ పంటవొచ్చే చెట్లే లేవు. ఎరువూ, గిరువూ బాగేసుకొని పంట తెచ్చుకుంటే రేట్లు మనకు బాగనే

* సుంగిడి గింజలు: పంటపెట్టే సమయంలో తెచ్చుకున్న అప్పకు పంట పండగానే ఒక రూపాయకు ఒక శేరు వడ్ల ప్రకారం షావుకారికి ఇచ్చే గింజలు.

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు
CSC
చనుమోలు
కోల్డ్ స్టోరేజ్ (ప్రై) లిమిటెడ్
పొగాకు వ్యాపార సోదరులకు రైతుసోదరులకు సదవకాశం.
గుంటుపల్లి, విజయవాడ. Ph:64757(Off)88411,88606 యూనిట్
TEJA • Bomma

అబ్బుతాయితే మామా" అంటూ పక్కతోట దస్తగిరి వచ్చి కూర్చున్నాడు.

"ఏమి అబ్బుతాయో యేమోనప్పా! మల్లా ఇప్పుడు ఎరువులంటే మాటలేమోయ్? దిబ్బలో ధండిగా ఎరువన్నా వుంటే ఏదోలే అనుకోవచ్చు. కాని యెయ్యల్లంటే సాద్దెమయితుందా? ఎడగారు కాపు నిలుపుకుందా మనుకుంటే కాపే రాకపాయ, గెయి రంగం పంట నోటికొచ్చేది నాశనమయి పాయ. ఇంగ ఇది యా మాత్రమో! దీన్ని నమ్ముకొని సున్నగ బాకీలు యాల వెయ్యల్లప్పా? ఈటికే బరువయి పొయ్యింది. అంతగా సీజన్ పంట బాగా కనిపిస్తే అవసరమయితే చెక్కో గిక్కో యేసుకోవచ్చులే." అని బీడీ అంటించుకున్నాడు నారపరెడ్డి.

ఇద్దరూ 'తెట్టుగోడ' దగ్గర బండమీద కూర్చొని చెట్ల పక్క చూస్తూ బీడీ తాగుతూ 'సవాలు' చేస్తున్నారు. దస్తగిరి అదీ ఇదీ మాట్లాడి వూర్లోనే సుద్దులు ఎత్తుకున్నారు. మర్నాడు వెంకటప్ప కొడుకు పెండ్లికి నార్వలకు పోవాలనుకున్నారు. పెండ్లి కథలు మాటల్లోకి వొచ్చాయి–

"సుబ్బిరెడ్డికి ఇంగా యాడా సంబంధం సూల్లేదా మామా"? దస్తగిరి అడగాడు.

"సూడల్లప్పా, వానికో ఇరవై అయిదు దాటిపాయ. ఇంగా సూడకుంటే యెట్ల? పాప వొగతీ అడ్డ ముండాది. ఈ కాలంలో ఇట్లా పంటల్లో ఆడపిల్ల పెండ్లంటే మాటలేమోయ్! అందులో కాపోల్లం అయి పోతిమి. కులానికి కాపోల్లమేగాని ధనానికి కాదు గదప్పా. పిల్లోనికి పిల్లనిచ్చే వాల్లేమో ఏమీ ఇచ్చుకో లేమంటారు. చేసుకొని పొయ్యే వాల్లేమో దండిగా కావల్లంటారు. వొగరిచ్చేది శాశ్వతంగా వుంటుందా? ఎంతన్నా చెప్ప పేదోనికి అన్ని యిదాలా కష్టమేనప్పా" నిట్టూరుస్తూ బీడీ ఆరిపేశాడు సూరపరెడ్డి.

"యాడన్నా ఎదరూ బదురూ చూస్తే మేలుగదా మామా. ఎవురి పెండ్లి కర్చులు వాళ్లు పెట్టుకుంటే సరిపోతుంది గదా!"

"అదే సూస్తాందాం నన్నా, మొన్న చుక్కలూరోళ్ళు వొచ్చి చూసుకొని పోయినారు. గెట్టిగా కుచ్చోని ముగ బడితే సరిపోతాది. కానీ పెండ్లి కర్చుల కన్నా సుమారగ కావల్ల గదప్పా. యావి కొనల్లన్నా తారకమంటుతాది. ఈ పంటలు చూస్తే ఇట్ల కాలబడి పోతాండాయి. ఏందో అంతా వూబిలో చిక్కుకున్నెట్ల అయ్యింది దస్తగిరీ" దిగులు పడ్డాడు నారపరెడ్డి.

"దిగులు పడద్దు మామా. దిగులు పడితే అయి తాదా? ఇసారి సీజన్ పంట తప్పకుండా గడ్డకు ఏస్తాదిలే".

"ఏమేస్తుందో యేమోనప్పా! పంట చేతి కొచ్చి నప్పుడు వొచ్చిందనుకోవల్ల. ఏ నిమిశానికి యేమి జరుగుతుందో యేవురికి తెలుసు? కంచంలో వుండేది నోటికి అందకుండా పొయ్యే కాలమొచ్చింది". అంటూ నారపరెడ్డి పైకి లేచాడు.

* * *

బంగారు తీసీయ లేదని పుట్నింటికి వచ్చిన సుబ్బమ్మ అలిగి కూర్చుంది. ఇంట్లో జెగితి మీద కూర్చొని అందరూ మవునంగా సుబ్బమ్మ పక్కే చూస్తున్నారు.

"కొత్తబట్టలు కట్టుకొని వొడి బియ్యము యేసు కోమ్మా. ఇంగ మూన్నెల్లే గదా! చీనాకాయాలు పీకు తానే తప్పకుండా మీ బంగారు తీసిస్తాంలే. ఆడపిల్ల సొమ్ము వుంచుకుంటామా? ఏమంటే మా పరిస్తి తులూ బాగలేక-----" అంటూ కంట తడిబెట్టింది చెన్నమ్మ.

"నాకు తెలుసునమ్మా, నేను మీ కన్నబిడ్డను. మిమ్మల్ని బాదపెట్టి బంగారు కావల్లంటావా! కానీ ఆ ముదనష్టపు ముండలు నన్ను తిట్టినా కొట్టినా బాదపడను నాయన్నూ నిన్నూ అనరాని మాటలు అంటాంటే-----" బోరున ఏడ్చింది సుబ్బమ్మ.

చెన్నమ్మ నోట్లో కొంగు దురుక్కొని విలపిస్తూ బిడ్డను కరుసుకుంది. జెగిత మీద కూర్చొని స్తంభానికి ఆను కొని గుడ్లమీద నీళ్లు నింపుకొని పెదవులు నోట్లోకి ముదుచుకున్నాడు నారపరెడ్డి. సుబ్బిరెడ్డి మవునంగా గాటి మీద కూర్చొని కన్నీళ్ళు కారుస్తున్నాడు. లక్ష్మిదేవి లోపలి వాకిలి దగ్గర పంచకు నిలబడి కుమిలి కుమిల్లి ఏడుస్తూ వుంది. కొండారెడ్డి ఇంట్లో లేదు. చిన్నపిల్లలు బయట ఆడుకొంటున్నారు.

"తోటగూడా ఆయికం పెడతామని చెప్పి రంగ య్యను ఇంగా వొగ ఇరవై వేలుఅడుగు పోనాయనా. మనయెవసాయం యెట్లా చెడిపొయ్యింది. అక్క య్యన్నా సుకంగా వుండనీ." వొక నిర్ణయానికొచ్చి చెప్పాడు సుబ్బిరెడ్డి.

"అడగల్పిందేనప్పా. ఎన్నాల్లని ఆయమ్మ కన్నీల్లు చూసేది? ఆడపిల్ల ఇంటికొచ్చి పోకిస్తే బాగుండ దంటారు. కూలిపోయినా పర్వాలేదుగానీ ఈ బాద వొద్దప్పా." నారపరెడ్డి గొంతు బొంగరువోయింది.

"ఆ కొంపకు పోయి బంగారమా కట్ల వుండే పిల్ల యెట్లయిందో చూస్తే కడుపు కాలిపోతాది----- దానికి దూము తగలా! అదీ ఆడపిల్లల్ని కనిందే. రేప్పొద్దన దాని బిడ్లకూ ఇదే గతి రాకుండా పోతుందా?" శాపనార్థాలు పెట్టింది చెన్నమ్మ.

"నాయినా, వొగ మాటడుగుతా. కాదనొద్దు నాయినా" ఏడుస్తూనే అడిగింది సుబ్బమ్మ.

"అడుగమ్మా, నీకు శానా కష్టంగా వుంటే ఆ యింటి గడపే తొక్కద్దులే. కనిపెంచి ఇంతదాన్నే చేసినా మంట, ఈ పొద్దు నువ్వు మాకు బారమయితావా తల్లీ!"

"అట్లా పరిస్థితి రాదులే నాయినా. కట్టుకున్నోడు నోరుసచ్చినోడే గానీ పెండ్లాన్ని వొదిలేసేవాడు కాదు."

"ఇంగ వాల్ల గోడంతా ఆ బంగారం కోసరమే గదమ్మా. అందికే బూమిని ఆయికం పెట్టయినా సరే, వొగవారం పది దినాల్లో ఆ ఇవ్వల్పిన బంగార్ను తెచ్చిస్తానే తల్లీ."

"వొద్దు నాయినా. మీ కాళ్ళు పట్టుకుంటాను. నా కోసరం బూమి అమ్మద్దండి. అదే నేను అడిగేది."

"నీ కోసరమని కాదమ్మా. రుణం శానా పెరిగి పోయ్యింది. వొగరి రుణంలో పొయ్యే కంటే అడక్క తినేది మేలమ్మా."

"వొద్దు నాయినా, మట్టిని నమ్ముకొని బతికేవాళ్లం. పెద్దలు సంపాయిచ్చింది పోగొట్టుకుంటే పిల్లోల్ల గతేం కావల్ల? ఇంట్లో యెదిగిన పిల్ల వుంది. ఇట్లా తప్పుడు బూమిని అమ్మితే లోకులుఏమనుకుంటారు? యెట్లనో నా బాద నేను పడతాను" సుబ్బమ్మ పెద్దమనసు చేసింది.

అందరి మధ్యనా మవునం ఆవరించింది. పిల్లలి ద్దరూ గీసులాడుకుంటూ ఇంట్లోకి పరువెత్తివచ్చారు. వానొచ్చి వెలసి పోయినట్లు నిశ్శబ్దంగా వున్న అందర్నీ మార్చిమార్చి చూశారు.

* * *

వేసవి పంట శెనక్కాయ పీకించాడు నారపరెడ్డి. పదైదు మూటలయ్యింది. ఆరువేలు చేతికొచ్చింది.



–చీనా చెట్ల బదులు తోటంతా శెనక్కాయ వేసు కొని వుంటే ఈ పాటికి లక్షణంగా నాలుగు రూకలు చేతిలో పెట్టుకుండేటట్లు అయ్యేండు ఈ బాదలన్నీ తప్పేండు. ఈసారి చీనా చెట్ల పంట యెట్లెట్లనో బాగానే వుంది. చెక్క ఏసినందువల్ల చెట్లూ కాయలూ శానా నాన్నెంగా వస్తాండాయి. అప్పడే కాయలు రంగు తిరుగుతాండాయి. ఎట్ల లేదన్నా నాగపూరు లోడు కావొచ్చు ఆలోచిస్తూ నారపరెడ్డి, మాట ప్రకారం అనంతపురంలో రత్నమయ్య శెనక్కాయల మిల్లులో చెక్కెదుడ్లు ఐదువేలూ, వొడ్డి మూడు వందలూ ఇచ్చి పూరుచేరుకున్నాడు.

చుక్కలూరి వాళ్లు మాట్లాడడానికి వొచ్చారు. "గతి కితే అతకదని" భోజనాలు వద్దని టిఫెన్లతో సరిపెట్టు కొని కాఫీలు తాగి కూర్చున్నారు. నారపరెడ్డి కూతురు లక్ష్మీదేవిని వాళ్ల పిల్లవానికీ, వాళ్ల పాపను సుబ్బిరె డ్డికీ ఇచ్చి పెండ్లి చేసుకోడానికి వొప్పకున్నారు. ఎవరి పెండ్లి ఖర్చులు వాళ్లవే అని, ఇచ్చిపుచ్చుకోడాలు లేదని నిర్ణయం చేసుకున్నారు. శ్రావణ మాసంలో 'మంచిమాట' చేసుకొని కార్తీకమాసంలో పెళ్లికార్యం పెట్టుకునేందుకు ఇరుపక్షాల వాళ్ళూ అంగీకరించారు. మాట్లాడేది అంతా అయిపోయాక మరీ వొకసారి కాఫీ లొచ్చాయి. లక్ష్మీదేవి కుందనపు బొమ్మలా పట్టుచీర కట్టుకొని తలనిండా పూలు పెట్టుకొని కాఫీలు తెచ్చి ఒక గ్లాసు పెళ్లి కొడుక్కి అందించింది. వియ్యాలవారి వైపు నుంచీ ఎవరో 'నీ పేరు చెప్పమ్మా' అని అడిగారు. పేరుతో పాటు లక్ష్మీదేవి లేత తమలపాకులాంటి చెక్కిళ్లమీద కదలాడే సిగ్గుతెరలను గమనించాడు పెళ్లి కొడుకు. సుబ్బమ్మ ముసిముసిగా నవ్వింది. చెన్నమ్మ మురిసిపోయింది. సుబ్బిరెడ్డి కళ్లల్లోని కొత్తకాంతులు చుక్కలూరి వైపు చూస్తున్నాయి.

* * *

"ఇంత చీకటి పడేదంకా అడవిలో యాలుంటా వప్పా? కాలాలు బాగలేవు. రొంత పొద్దుగలగ ఇంటికొచ్చేది నేరుసుకోండి" ఆలస్యంగా ఇంటికొచ్చిన సుబ్బిరెడ్డిని మందలించింది చెన్నమ్మ.

"పొలాల్లో పారాడే వాళ్లు చీకటి గీకటని బయప డితే అయితుందేమ్మా?" తేలిగ్గా అన్నాడు. సుబ్బిరెడ్డి.

"మీకేమప్పా మొగోల్లు! యాదన్నా గానీ 'సులకాగ' మాట్లాడతారు. ఇండ్లదెగ్గిరుండే ఆడోల్ల దిగులు మీకు యేమర్తమయితాది? సంసారం ఆరంబారం మోసు కున్నెంక అన్నీ ఆలోసెన చెయ్యాల్లప్పా. మొరటగా వుండద్దండి" అంటూ చెన్నమ్మ పళ్లెంలో ముద్దపెట్టు కొని వొచ్చింది. సుబ్బిరెడ్డి 'జలాటిలో' కాళ్లు ముఖం కడుక్కొని వచ్చి పళ్లెం ముందు కూర్చున్నాడు.

"ఇసారి అనంతపురానికి పాయినప్పడు వొగ బ్యాట్రీ అన్నా తీసుకురా, మొబ్బునా మాడానా తోటకాటికి పొయ్యేపవి" కాస్తా గట్టిగా మొగునికి చెప్పింది చెన్నమ్మ.

"చేతిలో దుడ్లు వుంటే తీసక రాగూడదని నాకే మన్నా సెరత్తా? ఎన్ని దుడ్లు వొచ్చినా గండ్ల జల్లెడిలో నీల్లు పోసినట్ల చేతిలో పైసా కూడా నిలబడకుండా కారిపోతండాయి. ఇంగ యాడ బ్యాట్రీ కొనేది? అదే మన్నా అయిదూ పదికీ వొస్తుందా? ఎట్టలేదన్నా మూడు సెల్పుల బ్యాట్రీ నూర్రుపాయలకు తక్కువుండదు. సెల్పులు చూస్తే వొగొగటి ఎనిమిది రూపాయలంట. అంతరేటు పెట్టి తీసకొస్తే మూడు సెల్సు పదైదు దినాలు కూడా రావు. ఇంతకు ముందు చూస్తావుం టిమి గదా! ---- రైతులు మొబ్బులూ మాడాలూ. అనుకుంటే అవుతుందా? అన్నిటికీ ఆ బగవంతుడే వుండాడు." నారపరెడ్డి వేదాంతం వల్లించాడు.

"అన్నిటికీ బగవంతుడు వుండాడని గాల్లో దీపం పెట్టి బగవంతుడా నువ్వే దిక్కని అంటే యెట్ల? మనయత్నం మనం చెయ్యాల్ల గదా!" జీవిత తత్వం తెలిపింది చెన్నమ్మ.

* * *

చీనా తోటల్లో గెయిరంగం కాపు అయిపోవచ్చింది. కొంతమందికి రేట్లు బాగానే అబ్బాయి. నాగపూరులో మొదట్లో టన్ను అయిదారువేల దాకా అమ్ముడుపో యింది. రానురానూ రేటు మందమయింది. ఇంకొక నెలదినాల కల్లా సీజన్ పంట మొదలవుతుంది. అప్పడు సరైన రేటు దొరుకుతుందో లేదోనని కొంతమంది ముందుగానే పచ్చికాయలే పీకి మార్కెట్టుకు వేసుకొని పోతున్నారు.

ఎండ తీవ్రంగా వుంది. నారపరెడ్డి తోటలో మామి డిచెట్టు కింద కూర్చొని కలబంద నారతో తాళ్ళు పేడుతున్నాడు.

"ఇసారి చీనాకాయలు నాగపూరుకు తోల్తారా, హైదరాబాదుకు యేసుకొని పోతారా పెదనాయనా?" అంటూ పక్క తోట గోపాలు వచ్చి కూర్చున్నాడు.

"అదే' యెట్ల చెయ్యాల్లో ఆలోసిస్తాండా గోపాలూ. ఐదరాబాదు మార్కెట్టు శానా మోసమంట గదప్పా! తూకాలు సరిగ్గా వుండవంటారు. రేటు కూడా వొగొ గసారి శానా తల్లకిందల అయితుందంట. * సూటు వొగటిన్నర కింటాలు తీసుకుంటారంట. నిజమేనా గోపాలూ?" తాము ముప్పరివేస్తూ అడిగాడు నారపరెడ్డి.

"అవునంట పెదనాయనా. లెక్క గూడా సరిగా రారంట. నాలుగైదు దినాలు లేటు చేస్తారంట. దానమనీ దర్మమనీ యేందేందో సుమారగ పట్టు కొని ఇస్తారంట. నాగపూరు మార్కెట్టు దీనికంటే రోంత మేలంటనే. నువ్వు నిరుడు పొయ్యొంటివి గదా, యెట్లట్ల పెదనాయనా?"

"అదీ అంతే నప్పయ్యా. ఏమంటే ఆడ సూటు మాత్తరం టన్నుకు వొగ కింటాలే తీసుకుంటారు. అయితే లారీ బాడిగ సంపుకొని వస్తాది గదప్పా! కాబట్టి అంతా వొగటే అయితాది. మార్కెట్టుకు పాయినంక సరుకు మనది కాదప్పా. అంతా వాల్లదే. దలారి కాళ్లూ వాల్లే, యాలం పాడేదీ వాల్లే, కొనేదీ వాల్లే. ఇంగ రేటు పెంచే నా కొడుకు ఎవుడు?"

"తక్కువ రేటుకు మనం ఈకుంటే వాల్లేం జేస్తారు పెదనాయనా?"

"అట్ల అనేకి లేదు గోపాలూ. ఆడ సరుకు దించి నంక అబిమన్యుడు పద్మయూహంలో చిక్కుకున్నట్లే"

"అదికాదు పెదనాయనా, ఈ చీనాకాయల ఆసా ములంతా యేకమై యాపారస్తులు మోసం చేస్తాం దారని, తక్కువ రేటుకు సరుకులు ఇచ్చేది లేదని అందరూ కలబలుక్కొని మాట్లాడితే బాగుంటుంది గదా!"

"అది సాద్దెం గాన పని అప్పయా. వాల్ల దెగ్గిరికి పోయి, మన జుట్టు వాల్ల చేతికి అందిచ్చి మనం ఏమి చెయ్యగలమప్పా? అది మనకు కానని రాజ్జెం. వాల్ల బాస మనకు తెలీదు. మనం మాట్లాడేది వాల్లకు అర్తం కాదు. పచ్చిసరకు యేసుకొని పయి మార్కెట్లో దించినంక మాకు గిట్టదు. గిట్టుబాటు దర వొచ్చేదంకా మేము అమ్మము అని చెప్పేకి అయి తుందేమప్పా వొగాల అట్లంటిమనుకో, వాల్లదేం పోతుంది? కానీలే అనుకుంటారు. సవాలు నిలిపి వూరకనే కుచ్చుంటారు. అప్పడు మన గతి?"

"మల్ల యెట్ల పెదనాయనా? సమ్మత్సరమంతా కష్ట పడి నానా తిప్పలూ పడి పండిచ్చుకొని సరుకు

* వ్యాపారస్తులు రైతుల నుంచి టన్నుకు ఒక క్వింటాల్ ప్రకారం చీనా కాయలను (బత్తాయిలను) వూరికే తీసుకుంటారు. దాన్నే 'సూటు' అంటారు.



మార్కెట్టుకు యేసకపోతే కడాకు వాళ్లు ఆడింది ఆటా పాడింది పాటా అయితే రైతులు ఏంగావల్లి?"

"అంతే నప్పయ్యా. రైతులు ఏమయితే వాల్లకేం? ఆ నాగపూరు మార్కెట్టు సువ్వు సూడల్ల సన్నా,కన్న తిప్పలు పడి, యెన్నెన్నో ఆసెలు పెట్టుకొని వచ్చి సరుకు ఆటికి యేసుకొని పోతే ఇంత ఆ నా కొడుకులు పేర్లు పెడతారు సూడప్పా, అబ్బబ్బా---! అనుకుంటే బాద యిపోతుంది గోపాలూ. ఆ యాలం పాడేది సూస్తే అరికాల్లో మండుతుంది. రేటు వాల్లు ఎంతనుకుంటే అంతే మనం వూరకనే సర్కసు బొమ్మల మాదిరి ఆడల్సిందే. పంట పండిచ్చినోడు యాడుండాడో, కొని తినే వాడు యాడుండాడో గానీ వూరికే 'అగనాగ్గా' మద్దెలో వుండే దలారి నా కొడుకులు కుచ్చోని జోబీలు నింపుకుంటారప్పా." నాగపూరు మార్కెట్టు గుట్టంతా విప్పాడు నారపరెడ్డి.

" దేశంలో పండే చీనాపంటలో ముక్కాలు భాగం మన అనంతపురం జిల్లాలోనే పండుతుందంటారు. అట్లా తప్పడు గవర్నమెంటోళ్ళు ఇక్కడే యాదన్నా వొగ జూస్ ఫ్యాక్టరీ పెడితే యెంత బాగుంటుంది పెదనాయనా! రైతులకు ఈ అగసాట్లు తప్పిపోతాయి గదా" దూరం ఆలోచించాడు గోపాలు.

"పెడితేనేమో బాగుంటుందప్పా. అయితే పెట్టే వాడు కావాల్లగదా! గవుర్మెంటుకు రైతులను గురించి అంతమాత్తరం ఆలోసినే వుంటే మన బతుకులు ఇట్లెందుకు వుంటావుండె? ఎప్పుడో బాగుపడిండే వాల్లం---యేందోలే, ఎవుర్ని అనీ యేం లాబం? యా జలమంలోనో పాపం చేసి రైతుగా ఈ గడ్డలో పుట్టినామని అనుకోవల్ల, వూరుకనే వుండల్ల". నిట్టూరుస్తూ పైకి లేచాడు నారపరెడ్డి.

* * *

రోజులు బరువుగా వెళ్ళిపోతున్నాయి. బాధలూ కన్నీళ్ళూ, వ్యధలూ కథలూ అన్ని కాలగర్భంలో కలిసిపోతున్నాయి.

'చీనాచెట్ల సీజను కాపులు వచ్చాయి. అక్కడక్కడ కాయలు పీకుతున్నారు. దినదినానికీ రేటు తారుమారు అవుతూ వుంది. నిలకడగా వుండడం లేదు. అందరూ ఈసారి సీజనుకాపే తక్కువుందని అంటూ వుండిరి. అటువంటిది వొక్క నాగపూరుకే ప్రతిదినమూ డెబ్బై యెనభై లారీల చీనాకాయలు పోతున్నాయి. లారీ బాడుగలు కూడా 'లెస' పెంచారు. నాగపూరుకు వేసుకొని పోయి ఆ అగచాట్లు పడడం కంటే వ్యాపారస్తులు అడిగితే తోటదగ్గరే కాయలు అమ్మడం మంచిది.' ఇట్లా అనుకుంటా తోట దగ్గర నుంచీ నారపరెడ్డి సుబ్బారెడ్డి ఇంటికొచ్చారు.

చీనాకాయల వ్యాపారస్తులు వొస్తున్నారు. పోతున్నారు కానీ రేటు 'వొగ తెగ'లేదు. టన్నుమీద సూర్రూపాయలు వులికిగా మొత్తంమ్మీద రెండు మూడు వేలు ఎక్కువ వస్తుందని, ఏదో వొక అక్కర తీరుతుందని సుబ్బిరెడ్డి తాపత్రయపడసాగాడు. దినాలు గడిచేకొద్దీ ఏమవుతుందోనని నారపరెడ్డి గుబులుగుబులైపోసాగాడు.

"ఎంట్రెన్సు టెస్టులో నాకు ర్యాంకు వొచ్చింది నాయనా." అంటూ సంతోషంగా పేపర్ తీసుకొని వచ్చాడు కొండారెడ్డి.

"అంటే యేందప్పా?" మామూలుగా అడిగాడు నారపరెడ్డి.

"అంటే డాక్టరు కోర్సులో చేరడానికి పరీక్ష పెట్టినారు నాయనా, దాంట్లో పాసయినాను."

కొండారెడ్డి చెప్పింది వింటూనే చెన్నమ్మ ముఖం విడిగిన సూర్యకాంతం పువ్వులా అయింది. చాలా రోజులయ్యాక ఆమె ముఖంలో మళ్ళీ కళకళ చూశాడు నారపరెడ్డి. దానిలోతుపాతులేంతో తెలియకుండానే డాక్టరు కోర్సు అనగానే అమాయకంగా సంతోషపడింది చెన్నమ్మ. సుబ్బిరెడ్డి కంటికొనల్లో ఆనందబాష్పాలు పొరాడినాయి. లక్ష్మీదేవి ముసి ముసి నవ్వుల్లో అనుబంధ పరిమళాలు దోబూచులాడాయి. చిన్నపిల్లలిద్దరూ 'మా అన్నయ్య డాక్టరయితాడు, మా అన్నయ్య డాక్టరయితాడు' అంటూ కొండారెడ్డి చేతులు పట్టుకొని చెరొకపక్క ఎగురుతున్నారు.

"యామాత్తరమయితుందప్పా, సదవడానికి కర్చు?" చాతనయితే పోరాడుదామని అడిగాడు నారపరెడ్డి.

"సంవత్సరానికి తొమ్మిదివేలు ఫీజుకూ బుక్కులకూ కట్టల్ల నాయనా. ఇంగ ఖర్చులు ఎట్ల లేదన్నా అయిదారు వేలు అయితుంది". చెప్పలేక చెప్పాడు సుబ్బిరెడ్డి.

"నోయమ్మా! అంత కర్చంటే అయ్యేపని కాదులేప్పా. అంతింతపెట్టి అయిదేండ్లు చదవల్లంటే మన శాతనయితుందా?"


"అదే నేనూ ఆలోచిస్తాండా నాయనా. డాక్టర్ కోర్సు చదవడమంటే మన సంసారానికి బరువే" తండ్రి పరిస్థితిని అర్థం చేసుకొని అన్నాడు కొండారెడ్డి. ఒక పక్క ఇప్పుడు డాక్టర్ల జీవితమూ సమాజంలో వాళ్ళ హోదా, పలుకుబడీ, తాను డాక్టరుగా పేరుపొందడం, తన అమ్మానాన్నా అందరూ టవును చేరి కష్టాలూ కన్నీళ్ళూ లేకుండా జీవించడం, తన పల్లెవాళ్ళు అప్పుడప్పుడు వచ్చి తన దగ్గర వ్యాధి చూపించుకొని, ఉచితంగా మందులు ఇప్పించుకొని తనను దేవునిగా గౌరవించిపోవడం అంతా కళ్ళముందు కనిపిస్తూ వుంది. మరోపక్క తనకు అంత అదృష్టం లేదేమో అనిపించింది.

"ఎట్లన్నాగానీ సదువుదువులేప్పా. ఈ సంసారంలో బాదలు ఎప్పుడూ వుండేవే కదా! ఏదో వొగరకంగా చీనాకాయల రేటు తగులుకుంటే పోదువులే" తమ్మునికి ఆశకల్పిస్తూ ధైర్యం చేశాడు సుబ్బిరెడ్డి.

"కాదురా పెద్దోడా, నీకేమన్నా అర్థమయితుందా లేదా? యాడ బాకీలు ఆడ పెట్టుకొని, వేలు వేలు కర్చుపెట్టి వాన్ని డాక్టరు కోర్సు సదివిచ్చేకి మన శాతనయితుందేమప్పా? మంచం ఎంతుంటే అంత కాళ్ళు చాపుకోవల్ల నాయనా! బడాయికి పోతే బట్ట పోగొట్టుకోవల్సిందే! సక్కెక్కడ, నాగలోకమెక్కడప్పా! యెవురన్నా యింటే నగుతారు?" కుండ బద్దలు కొట్టినట్లు చెప్పాడు నారపరెడ్డి.

"పెద్ద సదువులు సదివే వాల్లంతా సావుకార్లే సదువుతాండారా నాయనా? ఎంతమంది బీదాబిక్కీ ఇంజనీర్లూ కాలేదూ? ఎట్లనో అవస్త పడల్ల, సదివిచ్చల్ల. వొచ్చిందే సీటు పోగొట్టుకుంటే మల్లా సంపాయిచ్చుకుండేకి అయితుందా? పరీక్షలకు తయారయ్యేకి గుంటూరికీ నెల్లూరికీ పాయి, ప్రయివేటు కాలేజీల్లో చేరి వేలు వేలు కర్చుపెట్టి పరీక్షలు రాస్తాండారు. అంతింత కర్చు పెట్టినోల్లంతా సీటు సంపాయిచ్చుకుంటాండారా? అట్లాది మనోడు పైసా కర్చులేకుండా సొంతంగా సదువుకొని పరీక్షరాసి పాసయినాడు. డాక్టరు కోర్సు సదవడానికి సీటుకోసరం రెండు మూడు లక్షలు ఇచ్చేవాల్లుండారు. మనకు వూరకనే సీటు వొస్తావుంటే సదువుకుండే కర్చులకే బయ


మాసభ్యులకు,ఏజంట్లకు,మిత్రులకు,శ్రేయోభిలాషులకు దీపావళిశుభాకాంక్షలు
Ph:64757,66757
చనుమోలు
చిట్‌ఫండ్స్(ప్రై)లిమిటెడ్
చనుమోలులో సభ్యత్వం.... చింతలేని భవితవ్యం....
27-14-57,చనుమోలుకాంప్లెక్స్,రాజగోపాలాచారిరోడ్,విజయవాడ-2
Bomma
TEJA




పడితే యెట్లా?" సుబ్బిరెడ్డి డాక్టరు కోర్సు కథంతా చెప్పాడు.

"నువ్వు చెప్పేది బాగనే వుందప్పా. వాడు డాక్టరయితే సూడల్లని నాకూ వుంది. అయితే అన్ని దుడ్లు యెవురిస్తారు? యాట్నుంచీ తెచ్చేది?"

"ఎట్లనో చూస్తాములే నాయనా. నాకెట్లా సదువు అబ్బకపాయ. ముందుకు పొయ్యేవాన్ని వాన్నయినా పంపకపోతే యెట్ల? తరతరాల నుంచీ మన ఇంట్లో సదువుకున్నోడు లేడు. వాని అదురుస్టం కొద్దీ మంచి సదువే అబ్బింది. ఏదో వొగటి చేసి వాన్ని పంపిస్తాము నాయనా". గట్టిగా ధైర్యంగా అన్నాడు సుబ్బిరెడ్డి.

రంగయ్యసెట్టి కొడుకూ, ఇంకా ఇద్దరు ముగ్గురు స్నేహితులూ వచ్చి మెడికల్ ఎంట్రన్స్‌లో ర్యాంకు వొచ్చినందుకు సంతోషంతో కొండారెడ్డిని అభినందించి వెళ్ళారు.

ఆ ఇంట్లో ఆ రాత్రి దీపం పొద్దుబోయే వరకూ వెలుగుతూ వుంది. చిన్నపిల్లలిద్దరూ ఆదమరిసి నిద్రపోతున్నారు. నారపరెడ్డి మనసులో రకరకాల వేదనలు, చెన్నమ్మ కంటి రెప్పల కింద పలురకాల బాధలు, సుబ్బిరెడ్డి కళ్ళముందు లెక్కలేనన్ని ఆశలు, కొండారెడ్డి మెదడులో అంతులేనన్ని స్వప్నాలు, లక్ష్మీదేవి గుండెలో అస్తవ్యస్తమయిన అనుమానాలు చోటుచేసుకోసాగాయి.

* * *

నారపరెడ్డి తోటమీదే చీనాకాయలు అమ్మాడు. గార్లదిన్నె కుళ్ళాయప్ప తీసుకున్నాడు. టన్ను రెండు వేల రూపాయల ప్రకారం ఎన్ని టన్నులయితే అంత లెక్క కాయలు పీకిన నాడే ఇచ్చేటట్లు వొప్పందం చేసుకున్నారు. టన్నుకు వొక క్వింటాలు ప్రకారం 'సూటు' ఇవ్వడానికి కరారు చేసుకున్నారు. కుళ్ళాయప్ప వెయ్యి రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి వారం దినాల లోపల కాయలు తెంచుకొని పోతానని, ఆలస్యం చెయ్యనని చెప్పి పోయాడు.

నారపరెడ్డీ సుబ్బిరెడ్డీ లెక్క ఎంత వొస్తుందోనని మదింపు వేసుకున్నారు. సూటుపోయి ఎట్లలేదన్నా ఇరవై టన్నులు కావచ్చుననుకున్నారు. దరిద్రమంటే నలభైవేల వరకూ రావచ్చుననుకున్నారు. పెద్దమ్మాయి సుబ్బమ్మకు ఇవ్వవలసిన రెండు తులాల బంగారు తీసిచ్చి, రంగయ్యబాకీకి పదివేలు కట్టి ఎట్లన్నాగానీ తమ్మున్ని డాక్టరు కోర్సుకు పంపాలనుకున్నాడు సుబ్బిరెడ్డి.

వారం దినాలు గడిచిపోయాయి. కొండారెడ్డి మెడికల్ కాలేజి అప్లికేషన్ తెప్పించుకున్నాడు. సుబ్బిరెడ్డి చీనాకాయలు రేటస్ బాగా రావల్లని నాలుగు దినాలకు వొకసారి చెట్లకు తడి పెడుతున్నాడు. నారపరెడ్డి, గార్లదిన్నె కుళ్ళాయప్ప కోసం ఎదురుచూస్తున్నాడు.

పదకొండో దినం వొచ్చింది. 'పయిటాల' అయ్యింది. తల్లీ పిల్లా అందరూ ఇంట్లో జెగితిమీద అన్నం తింటున్నారు. నారపరెడ్డి భోంచేయడం ముగించుకొని బెంచీమీద గోడకు ఆనుకొని కూర్చున్నాడు. చెన్నమ్మ పళ్ళెం దగ్గర నుంచీ పక్కకు జరిగి స్తంభానికి ఆనుకొని కూర్చుంది. కొండారెడ్డి చేయి కడుక్కొని మూతి తుడుసుకుంటూ వచ్చి కాస్తా 'ఎడంగా' కిటికీ వెలుతురు పక్కనే కూర్చొని తమ్ముడు రాసేది చూస్తున్నాడు.

లక్ష్మీదేవి ఎంగిలి తట్టలు తీస్తావుంది. బయట ఎండగా వుంది.

గార్లదిన్నె కుళ్ళాయప్ప టువ్వాలుతో చెమటముఖం తుడుచుకుంటూ లోపలికొచ్చాడు. లక్ష్మీదేవి చేతులు కడుక్కొని చెంబునిండా చన్నీళ్ళు తెచ్చి ఇచ్చింది. గుటగుటా తాగేసి మిగిలిన నీళ్ళను ముఖం మీద చల్లుకొని తుడుచుకున్నాడు కుళ్ళాయప్ప.

"రొంత అన్నం తిందువురాన్నా" చెన్నమ్మ తృప్తిగా పిలిచింది.

"భోంచేస్తువు పదప్పా" ఆప్యాయతగా నారపరెడ్డి అన్నాడు.

ఇప్పడే తినొచ్చినానని అరుగుమీద కూర్చున్నాడు కుళ్ళాయప్ప.

"వారం దినాలు యెల్లిపాయ గదన్నా, కాయలు ఎప్పడు పీక్కపోతావు?" ఆత్రంగా అడిగాడు సుబ్బిరెడ్డి.

"ఇంగేం పీక్కపోతానప్పా? మార్కెట్టు పూర్తీ డవునయ్యింది." చప్పగా చెప్పాడు కుళ్ళాయప్ప.

"మల్ల. యెట్లన్నా ఇప్పడు?"

"ఎట్లంటే యేం చెయ్యల్లప్పా? నన్ను నస్టపొమ్మంటావా? ఏదో మాట ఇచ్చినాను కాబట్టి చెప్పిపోదామని వొస్తిని. లేకుంటే మీ ఇస్టం. నన్ను బద్దునాయాలని మీరనుకున్నా పరవాలేదు. ముందురేటుకు మాత్రం తీసుకోలేను" జంకూ గొంకూ లేకుండా చెప్పాడు కుళ్ళాయప్ప.

టన్ను వెయ్యి రూపాయలు అంటూనే నారపరెడ్డి గుండె జల్లుమంది. నోట్లో మాట రాలేదు. కళ్ళుమూసుకున్నాడు. కంటిరెప్పల కింద ఆలోచన చిత్రాలన్నీ కనిపిస్తున్నాయి--

--పెద్ద బిడ్డ సుబ్బమ్మ కళ్ళనిండా నీళ్ళు నింపుకొని ఏడుస్తా వుంది. రంగయ్య ఇల్లు వదలండని బజార్లో నోరు చేస్తున్నాడు. రామయ్య వడ్డబాకీ కట్టమని అంగడి దగ్గర నిలేసి అడుగుతున్నాడు. గార్లదిన్నె సత్యమయ్య ఎరువుల బాకీ ఇచ్చి పంపమని 'సవుని' మనిషిని పంపాడు. అనంతపురం జవుళీ అంగడి నాగయ్య గుమాస్తాను పంపాడు. బతకడం ఎందుకని పెద్దోడు సుబ్బిరెడ్డి పురుగుల మందు తాగి గిలగిలా 'తనక'లాడుతున్నాడు. చెన్నమ్మ నేలబట్టింది. పిల్లలందరూ అనాథలమాదిరి ఏడుస్తున్నారు.

కళ్ళు తెరిచాడు నారపరెడ్డి. అందరూ మువునంగా వున్నారు. తలలొంచుకొని ఆలోచిస్తున్నారు. అందరినీ చూశాడు నారపరెడ్డి. దూరం నుంచి 'చుట్టగాలి' శబ్దం చేస్తూ వొచ్చి ఇంటిముందున్న అరుగుల మద్యలో తిరుగుతూ వుంది. దుమ్మంతా పైకి లేస్తూ వుంది. చెన్నమ్మ 'తుపూ తుపూ' అంటూ చుట్టగాలి పక్క ఎంగిలి మూసింది.

కుళ్ళాయప్ప పైకిలేచి యెల్లవారాడు. నారపరెడ్డి శరీరం వొణికి నట్లయ్యింది. తల తిరిగి నట్లయ్యింది. కళ్ళకు మబ్బులు కమ్మినట్లయ్యాయి. చుట్టగాలి గిరగిరా తిరుగుతూ రయ్‌మంటూ వాకిలిగుండా లోపలికి వచ్చింది. కుళ్ళాయప్ప దాన్ని లెక్కచెయ్యకుండా గడపదాటి అడుగు బయటికి పెట్టాడు. నారపరెడ్డి అట్లే గోడపక్కకు వాలి కిందపడిపోయాడు. లబోదిబోమంటూ అందరూ చుట్టుకున్నారు.*